
ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 49 | సోమవారం 17 నవంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +




మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...
బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715

# ఎమ్మెల్యే గారూ..! టైం టేబుల్ చూసోండి...



- ప్రతినెలా పెన్షన్ల పంపిణీలో పాల్గొనాలి..
- ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలలు సందర్శించాలి..
- తహశీల్దార్ కార్యాలయాల తనిఖీ, సమీక్షలు...
- నెలలో ఒకసారి ఓ గ్రామంలో పాదయాత్ర...
- ఇవన్నీ పాటించకపోతే పక్కన పెట్టడమే....

**అమరావతి, నవంబర్ 16 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి చంద్రబాబు రాష్ట్ర ప్రజల మెప్పు కోసం శత విధాల కృషి చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకొని ఉన్నప్పటికీ, సంపద సృష్టి కోసం అనేక కొత్త కార్యక్రమాలను చేపడుతున్నారు.ప్రజల మెప్పు కోసం చంద్రబాబు కొత్త నిర్ణయం ప్రజాక్షేత్రంలో ప్రజల మద్దతును పొందాలని ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా అనిపించడం లేదు. ఈ క్రమంలోనే ఆయన వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తన రాజకీయ చతురతను చూపిస్తున్నారు.తాజాగా ఎమ్మెల్యేలు విషయంలో సంచలన నిర్ణయం తీసుకున్న చంద్రబాబు ఎమ్మెల్యేలకు (మిగతా 2లో)

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరం

- తక్కువ ఆదాయ వృద్ధి..
- తక్కువ మూల ధన పెట్టుబడి..
- పెరిగిపోతున్న రుణ భారం...
- టిడిపి, జనసేన నేతలు చెప్పిన వాటికి పరిస్థితి విరుద్ధం...
- అభివృద్ధిలో దూసుకు పోతున్నామంటూ అబద్ధపు ప్రచారాలు..
- ఎక్స్ ద్వారా ఆందోళన వ్యక్తం చేసిన వైయస్ జగన్..



**తాడేపల్లి, నవంబర్ 16 :**

ఏపీ ఆర్థిక పరిస్థితిపై వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా ఆర్థిక పరిస్థితి ఉందని జగన్ తెలిపారు. కాగ్ నివేదికలను ఉటంకిస్తూ వైఎస్ జగన్ వివరాలను ఎక్స్లో పోస్టు చేశారు. తక్కువ ఆదాయ వృద్ధి, తక్కువ మూలధన పెట్టుబడి, పెరిగి పోతున్న రుణభారం అంటూ జగన్ పేర్కొన్నారు.వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా.. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరకరంగా మారింది. కాగ్ విడుదల చేసిన గణాంకాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా పరిస్థితి ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరును గమనిస్తే వారి వైఫల్యాలు స్పష్టంగా కనపడతాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి కేవలం 7.03% మాత్రమే ఉంది. 2025-26లోనైనా రాష్ట్రం ఆర్థికంగా కోలుకుంటుందని చాలామంది ఆశించారు.కానీ, కాగ్ విడుదల చేసిన గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. సొంత ఆదాయాలు ఏమాత్రం పెరగకపోగా, మూలధన పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గిపోతుంది. అయినప్పటికీ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు పోతుందంటూ ఎలా ప్రచారం చేస్తారు?. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎల్డీపీ వృద్ధిని 12.02%గా ప్రభుత్వం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ వృద్ధిని 17.1%గా లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఫలితాలు దారుణంగా ఉన్నట్లు కాగ్ నివేదికలే తేల్చి చెప్తున్నాయి. సంపద సృష్టి లేకపోవటంతో రాష్ట్రం తిరోగమనంలో ఉంది. కానీ, అభివృద్ధిలో వేగంగా పరుగులెత్తుతోందంటూ ఎలా మాట్లాడతున్నారు?' అని ప్రశ్నించారు.

# తలనొప్పిగా మారిన హెచ్ 1బి వీసా వ్యవహారం



2లో

# రాజ్యాంగం అందరిదీ

## రాజ్యాంగానిది 75 ఏళ్ల ప్రస్థానం




**అమరావతి, నవంబర్ 16 :**

భారత రాజ్యాంగానిది 75 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం గొప్పదనం గురించి మాట్లాడే అవకాశం తనకు రావడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. తన స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతి అని తెలిపారు. తన న్యాయవాద ప్రస్థానం అమరావతిలో ప్రారంభమైందని ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సీకే కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ , ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు హాజరయ్యారు. 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఎట్ 75 (మిగతా 2లో)

# బాలికలకోసం ప్రత్యేక పథకం

- ఒకటి నుంచి ఐదో తరగతి బాలికల వివరాలు సేకరణ..
- 30వేలకు పైగా వున్న బాలికలు.
- బాలికల పేరుతో పోస్టల్ అకౌంట్లు
- ప్రధాని చేతుల మీదుగా పథకం ప్రారంభిస్తారని సమాచారం..
- పూర్తి వివరాలు బహిర్గతం చేయని సత్యసాయి ట్రస్టు ...

**పుట్టపర్తి, నవంబర్ 16 :**

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపుర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భక్తాదులు భారీ సంఖ్యలో హాజరవుతున్నారు. శ్రీ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా ఒకటినుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలికలకోసం శ్రీ సత్యసాయి ట్రస్టు కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. జిల్లా విద్యాధికారి ద్వారా శ్రీ సత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థినుల వివరాలను సత్యసాయి ట్రస్టువారు సేకరించినట్లు సమాచారం. జిల్లాలోని సుమారు 30వేల మందికి పైగా బాలికల వివరాలు ట్రస్టు వారికి అందజేసినట్లు జల్లా విద్యాధికారి కిష్టప్ప తెలిపారు. ఇప్పటికే ఉచిత వైద్యం, విద్యతో పాటు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి ట్రస్టు వారు బాలికల భవిత కోసం మరో కొత్త పథకాన్ని అందజేస్తున్నట్లు (మిగతా 2లో)



# వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై బాబు యూటర్న్

- వైజాగ్ స్టీల్స్ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోతున్న ప్రభుత్వం..
- కేంద్రాన్ని సమర్థిస్తూ ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు..
- స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు..
- కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ తమ ఘనతేనని ప్రచారం...
- ఆ నిధులు స్టీల్‌ప్లాంట్‌ను గట్టెక్కించేందుకా..ప్రైవేటీకరణకా.
- మాజీ మంత్రులు సీదిరి అప్పన్న, రాజన్న దొర ఆరోపణలు...

**అమరావతి, నవంబర్ 16 :**



వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై సీఎం చంద్రబాబు తాజాగా సీఐఐ సదస్సు సందర్బంగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాం శమయ్యాయి. ముఖ్యంగా పనితీరు మెరుగు పర్చుకోకుండా ప్రైవేటీకరణ ఆపడం లేదంటూ ఉద్యోగులు ఒత్తిడి పెంచడాన్ని తప్పుబడుతూ సీఎం చేసిన వ్యాఖ్యలపై కార్మికసంఘాలు మండి పడుతున్నాయి. ఇదే క్రమంలో వైసీపీ కూడా చంద్రబాబు వ్యాఖ్యల్ని తీవ్రంగా తప్పుబట్టింది.గతంలో వైయస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట కరణను అడ్డుకోలేక పోతోందని దుమ్మెత్తి పోసిన చంద్రబాబు... ఇప్పుడు అధికారంలోకి వచ్చాక, నిస్సిగ్గుగా, నిర్లజ్జగా యూటర్న్ తీసుకున్నారని వైసీపీ మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, రాజన్నదొర ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామంటూ, ఒకవైపు ప్రజలను మభ్య పెడుతూ, మరోవైపు ఆ దిశలో కేంద్ర చర్యలను పూర్తిగా సమర్థిస్తున్నారన్నారు. అందుకు చంద్రబాబు తాజా వ్యాఖ్యలే నిదర్శనమన్నారు.'పని చేయకున్నా జీతాలివ్వాలా? తెల్ల ఏనుగులా మారితే ఎలా? ఎన్నాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులిస్తాయి? ఊర్కే జీతాలు ఎందుకిస్తాయి?' అనడం.. సీఎం చంద్రబాబు దిగజారిన వైఖరికి అద్దం పడుతున్నాయని వారు విమర్శించారు. ఎన్నికల ముందు ఎన్నెన్నో మాటలు చెప్పి, పచ్చి అబద్ధాలు చెప్పి, ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేసినట్లు విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులను కూడా (మిగతా 2లో)

# రాష్ట్రంలో మళ్లీ వర్షాలు

## బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగే అవకాశం

**అమరావతి, నవంబర్ 16 :**

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కొనసాగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదివారం వెల్లడించింది. దీని ప్రభావంతో సోమవా రం.. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఏపీ ప్రజలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.మరోవైపు అక్టోబర్ చివరిలో మొంథా తుపాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ చిగురుటాకులా వణికింది. ఈ తుఫాన్ కారణంగా.. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. లక్షలాది హెక్టార్లలోని పంట నీట (మిగతా 2లో)



# టైం టేబుల్ చూసుకోండి

(మొదటి పేజీ (తరువాయి)

టైం టేబుల్ ఇచ్చి పని చేయించాలని నిర్ణయించారు. 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని ఇటీవల ఆదేశం తెలుగుదేశం పార్టీలో కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహార శైలి ఇప్పటికే చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో పార్టీ పైన దృష్టి సారించిన చంద్రబాబు అనేకమార్లు పలువురు ఎమ్మెల్యేలకు తీరు మార్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు .ఇటీవల 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలలో కొంతమంది ఎమ్మెల్యేలు చురుగ్గా పాల్గొనడం లేదని, అలసత్వం ప్రదర్శించే ఎమ్మెల్యేలకు నోటీసుల ద్వారా తీరు మార్చుకోవాలని హెచ్చరిస్తూనే వారి వివరణ తీసుకోనున్నారు.

**ఎమ్మెల్యేలకు టైంటేబుల్ రూపొందిస్తున్న చంద్రబాబు**

ఎమ్మెల్యేలు తన చుట్టూ కాకుండా, ప్రజాక్షేత్రంలో ప్రజలు చుట్టూ తిరగాలని భావిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మంచిపనిని ప్రజలకు వివరించాలని, ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని మార్గనిర్దేశం చేశారు. తాజాగా ఎమ్మెల్యేలకు షాక్ ఇచ్చే మరో కీలక నిర్ణయం తీసుకున్న చంద్రబాబు ఎమ్మెల్యేలకు టైంటేబుల్ రూపొందించినట్టు తెలుస్తోంది. టిడిపి ఎమ్మెల్యేలు ప్రతినెలా ఒకటవ తేదీ క్రమం తప్పకుండా ఎన్టీఆర్ భరోసా సామాజికభద్రతా పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

**ప్రతీ నెల ఎమ్మెల్యేలకు షెడ్యూల్ ఇలా....**

ప్రతినెల 5వ తేదీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించాలని, ఆ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులు, విద్యా తదితర అంశాలను పరిశీలించాలని టైం టేబుల్ లో రూపొందించారు. అంతేకాదు ప్రతి నెల పదవ తేదీన నియోజకవర్గ పరిధిలోని అన్నా క్యాంటీన్లో ఎమ్మెల్యేలు భోజనం చేయాలని, అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న భోజనం ఏ విధంగా ఉంటుందో వారు తెలుసుకోవడంతో పాటు ప్రజలకు కూడా తెలిసేలా చేయాలని నిర్ణయించారు.

**టైం టేబుల్ లో ఈ కార్యక్రమాలు తప్పనిసరి..**

ప్రతి నెల 15వ తేదీన నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేయాలని, 20వ తేదీన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ, టిడిపి కార్యకర్తల బీమాకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని, 25వ తేదీన నియోజకవర్గంలోని ఎమ్మార్వో కార్యాలయం ఇతర ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేయాలని టైం టేబుల్ రూపొందించినట్టు తెలుస్తోంది .

**నెలలో ఒకరోజు ఒక గ్రామంలో పాదయాత్ర..**

అలాగే నెలలో ఒకరోజు తప్పనిసరిగా ఏదో ఒక గ్రామంలో పాదయాత్ర చేసి ప్రజలతో మమేకం కావాలని చంద్రబాబు సూచించినట్టు సమాచారం. ఈ టైం టేబుల్ తూచా తప్పకుండా ప్రతి ఎమ్మెల్యే పాటించాలని టిడిపి అధిష్టానం నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ప్రజల మెప్పు కోసం చంద్రబాబు చేసే ఈ అపర చాణక్యం ఏ మేరకు ఫలితాలను ఇస్తుందో తెలియాల్సి ఉంది.

# స్టీల్ ప్లాంట్‌పై బాబు యూ టర్న్

(మొదటి పేజీ (తరువాయి)



దారుణంగా వంచించారని, నిలువుగా దగా చేశారని వారు ఆరోపించారు. అదే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కొన్నాళ్ల క్రితం కేంద్రం ప్యాకేజీ ఇస్తే, అది తమ ఘనత అన్నట్లు విపరీతంగా ప్రచారం చేసుకున్నారని, స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకే కేంద్రం ఆ నిధులు ఇచ్చిందని, తమ చొరవ వల్లే కేంద్రం ఆ నిధులు ఇచ్చిందని డబ్బా కొట్టుకున్నారని, నిజానికి కేంద్రం ఆ నిధులు ఇచ్చింది స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించడానికా? లేక ప్రైవేటీకరణ సజావుగా సాగేందుకా? అన్నది చూస్తే.. రెండోదే ఖాయంగా తెలుతోందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్నప్పటికీ, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడడంలో సీఎం చంద్రబాబు ఇసుమంతైనా చొరవ చూపడం లేదన్నారు. పైగా తన సిద్ధాంతమైన ప్రైవేటీకరణకే మొగ్గు చూపుతున్నారని, అయినా నిస్సిగ్గుగా, నిర్లజ్జగా మళ్లీ రాష్ట్ర ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.తమ మద్దతుపై ఆధారపడిన ప్రభుత్వం కేంద్రంలో ఉన్నా చంద్రబాబు కానీ, పవన్‌కళ్యాణ్ కానీ నోరు మెదపడం లేదని వైసీపీ నేతలు ఆరోపించారు. కూటమి వైఖరితో ప్రత్యక్షంగా దాదాపు 20 వేల మంది ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పరోక్షంగా లక్షలాదిపై ప్రభావం చూపుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో తీపి తీపి మాటలతో నమ్మించిన కూటమి నేతలు స్టీల్ ప్లాంట్ విషయంలో రాష్ట్రప్రజలను నిండా ముంచేశారన్నారు. కేంద్రంతో కలసి ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కును కళ్ల ఎదుటే ఉరి తీస్తున్నారన్నారు.

# నేటి నుంచి ఆధార్ క్యాంపులు

## విద్యార్థుల కోసం17 నుంచి 26 వరకు ఆధార్ క్యాంపుల ఏర్పాటు..

## 15లక్షల మంది పిల్లల ఆధార్ అప్‌లోడ్ చేయాలి..

## 5ఏళ్ల నుంచి 17 ఏళ్ల వయసు వున్న వారికి ఎటువంటి రుసుము వసూలు చేయకూడదు



**అమరావతి, నవంబర్ 16 :**


రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు శుభవార్త చెప్పింది. పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తోంది. నవంబర్ 17 నుంచి 26 వరకూ పది రోజుల పాటు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఏపీ విద్యాశాఖ యూఐడీఏఐ సమన్వయంతో వీటిని ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక క్యాంపులలో పిల్లల ఆధార్ బయోమెట్రిక్‌ల అప్డేట్ పూర్తిగా ఉచితమని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు ఏపీలో 15 లక్షల మంది పిల్లల ఆధార్ కార్డుల వివరాలు బయోమెట్రిక్ అప్ డేట్ చేయాల్సి ఉందని యూఐడీఏఐ చెప్తోంది.ఏపీ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు శుభవార్త వినిపించింది. పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనుంది. నవంబర్ 17వ తేదీ నుంచి నవంబర్ 26వ తేదీ వరకు పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.

గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలోఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరక్టర్ శివప్రసాద్ జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. ఆధార్ జారీ సంస్థ గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 15 లక్షల మందికి పైగా పిల్లలు తమ ఆధార్ బయోమెట్రిక్ ఆప్డేట్ చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ ఆధార్ క్యాంపుల ద్వారా ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వయసులోపు పిల్లలు పాఠశాల వద్దే తమ బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇది పూర్తిగా ఉచితం. అయితే ఈ సేవలను ఒకసారి మాత్రమే ఉపయోగించుకునే వీలుంది.

మరోవైపు ఆధార్ కార్డు అనేది..ప్రస్తుతం అన్నింటికి ఆధారంగా మారిపోయింది. స్కూల్ అడ్మిషన్లు మొదలుకొని.. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల లబ్ధి వరకూ అన్నింటికీ ఆధార్ కార్డు అనేది తప్పనిసరిగా మారిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వాటికి కూడా ఆధార్ కార్డు తప్పనిసరి. అయితే ఆధార్ కార్డు అప్‌డేట్ తప్పనిసరి. ఐదేళ్ల లోపు పిల్లలకు బాల ఆధార్ కార్డు ఇస్తారు. అయితే పిల్లలకు ఫింగర్ ప్రింట్ వంటివి పడకపోవచ్చు. ఈ నేపథ్యంలో ఐదేళ్ల తర్వాత ఆధార్ కార్డులో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది.మరోవైపు అక్టోబర్ ఒకటి నుంచి ఆధార్ కార్డుల సేవా రుసుములు కూడా పెరిగాయి. గతంలో పేరు, పుట్టిన తేదీ వంటివి మార్చుకోవడానికి రూ.50 ఫీజు ఉండేది. అది కాస్తా ఇప్పుడు 75 రూపాయలకు చేరుకుంది. అలాగే ఆధార్ కార్డులో సాధారణ బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం గతంలో రూ.100 వసూలు చేసేవారు. ఇప్పుడా మొత్తం రూ.125కు చేరుకుంది, డాక్యుమెంట్ అప్‌డేట్ కోసం గతంలో రూ.50 తీసుకుంటే ప్రస్తుతం రూ.75 తీసుకుంటున్నారు.అయితే కొన్ని సేవలు ఉచితంగానే అందిస్తున్నారు. పుట్టిన పిల్లలకు కొత్తగా ఆధార్ కార్డు తీసుకోవడం కోసం ఎలాంటి డబ్బులు అవసరం లేదు. అలాగే 5 ఏళ్ల నుంచి 17 సంవత్సరాల లోపువారు తమ బయోమెట్రిక్ వివరాలను ఫ్రీగానే అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# బాలికల కోసం కొత్త పథకం

(మొదటి పేజీ (తరువాయి)



తెలుస్తోంది. ముఖ్యంగా బాలికల వివరాలు పోస్టల్ శాఖ వారికి చేరవేసి అక్కడ బాలికల పేరిట అకౌంట్లు కూడా ప్రారంభిస్తుండటంతో బాలికల భవిత కోసం శ్రీ సత్యసాయి ట్రస్టువారు ఏదో చేస్తున్నారన్న విషయం బలపడుతోంది. దాంతోపాటు విద్యాశాఖ ద్వారా ట్రస్టు వారు బాలికల వివరాలు సేకరించడం కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వున్నప్పుడు కూడా బాలికలకోసం సాయిబాబా వారు ఏదో చేస్తారట అనే వార్తలు కూడా వచ్చాయి. ఈనెల 19వ తేదీన ప్రధాని మోడీ పుట్టపర్తికి రానున్నారు. ఈనేపథ్యంలో శ్రీ సత్యసాయి శత జయంతి మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రధాని చేతుల మీదుగా ఆ పథకాన్ని శ్రీసత్యసాయి ట్రస్టువారు ప్రారంభించే అవకాశం వుంది. అయితే ట్రస్టు వారు ఈవివరాలను, బాలికల భవితకోసం తీసుకుంటున్న నిర్ణయాలను గానీ అధికారికంగా ఎటువంటి ప్రకటనలు ఇంతవరకు బహిర్గతం చేయలేదు.

# రాజ్యాంగం అందరిదీ..




(మొదటి పేజీ (తరువాయి)

ఇయర్స్' అనే అంశంపై ప్రసంగించారు జస్టిస్ గవాయ్.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తనను నియమించిన తర్వాత తొలిసారిగా ఏపీ రాజధాని అమరావతికి వచ్చానని చెప్పుకొచ్చారు. అమరావతికి రావడం తనకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అమరావతికి గొప్ప చారిత్రాత్మక గుర్తింపు ఉందన్నారు. మహారాష్ట్రలోని అమరావతిని ఇంద్రపురిగా పిలుస్తారని.. ఏపీలోని అమరావతి సైతం ఇంద్రుడు తిరిగిన నేలగా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. సీజేఐగా తన చివరి కార్యక్రమం కూడా అమరావతిలో జరుగుతోందని వివరించారు. భారత పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా రాజ్యాంగం రక్షణ కల్పించిందన్నారు సీజేఐ.పౌరుల ప్రాథమిక హక్కులు కాపాడేలా కోర్టులు రక్షణ కల్పించాలని సీజేఐ సూచించారు. రాజ్యాంగాన్ని.. రాజ్యాంగ సభకు అప్పగిస్తూ అంబేద్కర్ చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. సామాజిక, ఆర్థిక సమానత్వం సాధనే లక్ష్యంగా రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని వివరించారు. పౌరులందరూ సమానంగా ఎదిగేలా అవకాశాలను రాజ్యాంగం కల్పించిందన్నారు. మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా మహిళలకు సమాన అవకాశాలు రాజ్యాంగంలో కల్పించారని పేర్కొన్నారు జస్టిస్ బీఆర్ గవాయ్.'రాజ్యాంగం గత 75 ఏళ్లలో అనేక రంగాల్లో రిజర్వేషన్లను వర్తింపజేసింది. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లోనూ చట్టం చేశారు. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు విద్య ఎంతో ముఖ్యమని అంబేద్కర్ చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్ ఉండాలనేది నా అభిప్రాయం. జ్యోతి రావ్ పూలేను అంబేద్కర్ గురువుగా భావించేవారు. మహిళలపై అసమానత రూపుమాపేందుకు జ్యోతి రావ్ పూలే ఎంతో కృషి చేశారు. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష ఉండకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మహిళలకు సమానత్వం ఉండాలనేది సుప్రీంకోర్టు విధానం. న్యాయ రంగంలో మహిళలు చాలా బాగా రాణిస్తున్నారు' అని జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు.రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై అవగాహన కల్పించాలి. రాజ్యాంగం కల్పించిన అవకాశాలతో అనేక మంది అత్యున్నత స్థాయికి చేరారు. గిరిజన సామాజిక వర్గం నుంచి తొలి మహిళ రాష్ట్రపతి అయ్యారు. ఓ ఛాయ్ వాలా సైతం దేశ ప్రధాని అయ్యారు. ఎస్సీ వర్గాల నుంచి వచ్చిన బాలయోగి, మీరా కుమారి లోక్‌సభ స్పీకర్లు అయ్యారు. దేశంలో ఎంతోమంది ఎస్సీ వర్గం నుంచి సీఎస్‌లు, డీజీపీలు అయ్యారు. ప్రజలను హెల్తీ, వెల్దీగా ఉంచడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం' అని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు.

# చురుగ్గా వ్యవహరిస్తున్న సిట్ బృందం

**తిరుమల, నవంబర్ 16:**

ఏపీలో తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడిన వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన సిట్ అధికారుల బృందం దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. ఈ కేసులో ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లోని అనుభవం లేని డెయిరీలకు ఆర్డర్లు ఇవ్వడం, వారు పాలకు బదులు రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని టీటీడీకి పంపడం, దీన్ని వాడి లడ్డూ కల్తీ చేయడం జరిగిందని నిర్ధారణ అవుతోంది. దీంతో అప్పట్లో టీటీడీ ఛైర్మన్ గా వ్యవహరించిన ప్రస్తుత వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పాత్ర కీలకంగా మారింది.వైసీపీ అధినేత వైఎస్ జగన్ బాబాయ్ కూడా అయిన వైవీ సుబ్బారెడ్డికి గతంలో పీఏగా వ్యవహరించిన చిన అప్పన్న కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీల ప్రతినిధులతో చేసిన లావాదేవీలు బయటపడటంతో ఆయన్ను తాజాగా సిట్ అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో వైవీ సుబ్బారెడ్డి పాత్రను నిర్ధారించేందుకు విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు పంపింది. అయితే తాను అనారోగ్యంగా ఉన్నట్లు వైవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిట్ రూటు మార్చింది.అనారోగ్యంతో హైదరాబాద్ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైవీ సుబ్బారెడ్డిని అక్కడే విచారించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఈ నెల 20న హైదరాబాద్ లోని ఇంటికే వస్తామని, విచారణకు సిద్దంగా ఉండాలని వైవీ సుబ్బారెడ్డికి సిట్ అధికారులు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనికి వైవీ సుబ్బారెడ్డి అంగీకరించినట్లు సమాచారం. దీంతో ఈ నెల 20న జరిగే సిట్ విచారణలో వైవీ సుబ్బారెడ్డి చెప్పబోయే విషయాలు కల్తీ లడ్డూ కేసుకు కీలకంగా మారాయి.సిట్ ఇప్పటికే కల్తీ నెయ్యిని వాడి తిరుమల లడ్డూలు తయారు చేసినట్లు నిర్ధారణకు వచ్చింది. అయితే మధ్యలో అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పంపిన లడ్డూల తయారీకి మాత్రం నాణ్యమైన నెయ్యిని వాడినట్లు తేలింది. దీంతో ఈ రెండు నెయ్యిల మధ్య వ్యత్యాసం ఎందుకన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. కల్తీ లడ్డూ కేసులో ఇప్పటికే రాష్ట్రంలో కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఇప్పుడు వైవీ సుబ్బారెడ్డి ఈ కేసులో నిందితుడిగా తేలితే మాత్రం కూటమి వాదనకు మరింత బలం చేకూరనుంది. దీంతో ఈ నెల 20న సిట్ విచారణ కీలకంగా మారింది.

# ఢిల్లీ ఘటనలో మరో వైద్యురాలి అరెస్టు

**న్యూ ఢిల్లీ, నవంబర్ 16 :**



దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు పేలుడుఘటన అందరిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనతో అప్రమత్తమైన భారత భద్రతా బలగాలు దేశ వ్యతిరేక శక్తుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ముఖ్యంగా వైట్ కాలర్ టెర్రరిజంపైనే దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే జమ్మూ కాశ్మీర్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న హర్యానాకు చెందిన వైద్యురాలు ప్రియాంక శర్మను అదుపులోకి తీసుకున్నట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ అనే ఉగ్ర సంస్థలతో సంబంధమున్న అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ అనే ముగ్గురు డాక్టర్లను ఇటీవల అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వారిలో ఒకరైన అదీల్ అహ్మద్‌తో ప్రియాంక శర్మకు పరిచయం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఆదివారం జమ్ము కాశ్మీర్ లోని అనంత్‌నాగ్‌లో ప్రియాంక ఉంటున్న హాస్టల్ పై దాడి చేసి.. ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆమె మొబైల్ ఫోన్, సిమ్ కార్డును స్వాధీనం చేసుకున్న పోలీసులు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. ఆమె మొబైల్, సిమ్ కార్డు ద్వారా మరింత సమాచారం తెలిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దాదాపు 200 మంది కాశ్మీర్ వైద్యులపైన, దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లోని కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో చదువున్న కశ్మీర్ విద్యార్థులపైనా నిఘా పెట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఢిల్లీ లో కారు పేలుడుకు కారణమైన ఐ20 కారు నడిపిన వ్యక్తిని డాక్టర్ ఉమర్ నబీ అని భద్రతా ఏజెన్సీ సంస్థలు గుర్తించాయి.అంతేకాక అతడితో సంబంధమున్న మరో ఐదుగురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. వారందరికీ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో వారితో కలిసి చదువుకున్న, పని చేస్తున్న ఇతర వైద్యులపైనా అధికారులు నిఘా పెట్టారు. ఉగ్ర కుట్రలో ఫరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీ సిబ్బంది పాత్ర ఉండడం, నిందితులకు సంబంధించిన మరో కారు కూడా అక్కడే లభ్యం కావడంతో క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేశారు. అంతేకాక క్యాంపస్ మొత్తాన్ని ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. శనివారం అదే చదివిన మరో ఇద్దరిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# రాష్ట్రంలో మళ్లీ వర్షాలు

(మొదటి పేజీ (తరువాయి)

మునిగింది. దాంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బృందం.. ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో పర్యటించింది. పంట నష్టంపై నివేదికను రూపొందించి కేంద్రానికి అందజేసింది.శ్రీలంక సమీపంలో నైరుతి బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి తమిళనాడు వైపు కదలనుంది. దీని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు తమిళనాడుతోపాటు దానికి ఆనుకుని దక్షిణ కోస్తా, రాయలసీమ వైపు వీస్తున్నాయి. ఆదివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయి. సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతిభారీ, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయి. ఇక 18వ తేదీన నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.అలాగే ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం ఉంటుంది. మరోవైపు వాయవ్య భారతం నుంచి గాలులు కోస్తా, రాయలసీమ వరకు వీస్తుండడంతో చలి పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అరకులోయలో 7, డుంబ్రిగుడలో 7.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో చలిగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, అల్పపీడనం రాగల 24గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే, ఈనెల 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఈనెల 24-27 తేదీల మధ్య కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

### తలనొప్పిగా మారిన

# హెచ్ 1బి వీసా వ్యవహారం



**అమరావతి, నవంబర్ 16 :**

హెచ్ ఒన్ బి వీసా ఫీజు పెంపు వ్యవహారం భారతీయుల కొంప ముంచుతోంది. అమెరికా వెళ్లాలనుకునే వాళ్ల కలలు కల్లలు చేస్తోంది. చదువు, ఉద్యోగంతో పాటు చివరికి పర్యాటకం కూడా ఖరీదైన వ్యవహారంగా మారింది. ఒక్క హెచ్ ఒన్ బి మాత్రమే కాకుండా దాదాపుగా అన్ని రకాల విసాలకు చెల్లించాల్సిన ఫీజులు భారంగా పరిణమించాయి. ఫీజులు పెంచిన తర్వాత రెండు నెలల కాలంలోనే వీసా దరఖాస్తులు సగానికి పైగా పడిపోయినట్లు టెక్ ఆర్గనైజేషన్స్ చెబుతున్నాయి.ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు.హెచ్ 1బీ వీసా నిబంధనలు కఠినతరం కావడం పడే ప్రభావం తాత్కాలికమేనని, అమెరికాకు భారతీయ టెక్ నిపుణులు తక్కువ ఖర్చుతో సర్వీసులు అందిస్తారని, అవే వారికి తిరిగి అవకాశాలను కల్పిస్తాయని చెప్పారు. నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన సేవలను కలగలిపిన భారతీయ టెక్ నిపుణులకు అన్ని ప్రాంతాలలోనూ డిమాండ్ ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతీయ టెక్ నిపుణులు అతి తక్కువ ఖర్చుతో అమెరికాకు తమ సర్వీసులను అందిస్తోన్నారని, ఇది చాలా ముఖ్యమైన విషయమని చంద్రబాబు అన్నారు. ఖర్చును దృష్టిలో పెట్టుకుని అమెరికా భారతీయులను తప్పకుండా ఆశ్రయిస్తారని, ఇది ఖచ్చితంగా జరుగి తీరుతుందని చెప్పారు. తనకు ఆ స్పష్టత ఉందని తేల్చి చెప్పారు. ఎలాంటి ఆంక్షలు విధించినా అవి భారతీయ టెక్ నిపుణుల పురోగతిని ఆపలేవని ధీమా వ్యక్తం చేశారు. హెచ్ 1బీ విసా ఫీజు లక్ష డాలర్లకు పెంచడం వల్ల కొంతమంది ఇబ్బంది పడతారని, ఇది తాత్కాలికమేనని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కొత్త వీసా నిబంధనల వల్ల ప్రభావితమైన టెకీలకు అవకాశాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నారా అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. స్వదేశీ 4జీ టెక్ స్టాక్ నుండి ఉపగ్రహాలు, డ్రోన్లు, %ూ×% క్వాంటమ్ కంప్యూటింగ్ వరకు భారత్ అన్ని రంగాల్లో నెక్ట్స్ జెన్ టెక్నాలజీని అందిపుచ్చుకుంటోందని చెప్పారు. భారత్ ఎప్పటికీ అవకాశాలను సృష్టిస్తూనే ఉంటుందని అన్నారు. నైపుణ్యం, ఆర్థిక సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అనేక కంపెనీలు తమ నియామక వ్యూహాలను పునఃసమీక్షించుకుంటున్నాయని, ఈ మార్పు ఏపీ సహా దేశం నలుమూలల నుండి టెక్కీలకు సరికొత్త అవకాశాలను కల్పిస్తుందని చంద్రబాబు అంచనా వేశారు.

# ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి

**పాట్నా, నవంబర్ 16 :**

బిహార్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జాతీయ ప్రజాస్వామ్య కూటమి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించింది. కేబినెట్ కూర్పు కోసం ఒక ఫార్ములాను రూపొందించే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రకారం కూటమిలోని ప్రతి పార్టీకి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి చొప్పున నితీష్ కేబినెట్‌లో చోటు కల్పించనున్నట్టు సమాచారం. కేంద్రం హోం మంత్రి అమిత్‌తో జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ సహా ఎన్డీయే కూటమి సీనియర్ నేతలు శనివారంనాడు సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేబినెట్ కూర్పునకు సంబంధించిన ఫార్ములాపై చర్చించినట్టు తెలుస్తోంది.ఎన్డీయే ప్రతిపాదించినట్టు చెబుతున్న ఫార్ములా ప్రకారం, బీజేపీకి కేబినెట్‌లో సింహభాగం వాటా దక్కనుంది. 15 నుంచి 16 మంత్రి పదవులు లభించే అవకాశం ఉంది. జేడీయూకు 14 మంత్రి పదవుల వరకూ దక్కవచ్చు. చిరాగ్ పాశ్వాన్ ఎల్జేపీ (రామ్ విలాస్)కి 3 మంత్రి పదవులు, జితిన్ రామ్ మాంఝీ సారథ్యంలోని హెచ్ఏఎం (సెక్యులర్)కు ఒకటి, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ ఆర్ఎల్ఎంకు ఒక మంత్రి పదవి దక్కే వీలుంది.అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది. 243 అసెంబ్లీ స్థానాల్లో 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 89 స్థానాల్లో గెలిచి ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. జేడీయూ 85 సీట్లతో ఆ తర్వాత స్థానంలో ఉంది. ఎల్జేపీ-ఆర్వీ 19 సీట్లు, హెఏఎం(ఎస్) 5, ఆర్ఎల్ఎం 4 సీట్లు గెలుచుకున్నాయి.కాగా, కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారం తేదీని ఇంకా ప్రకటించనప్పటికీ సాధ్యమైనంత త్వరలోనే ఉండవచ్చని తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఎవరనేది కూడా లాంఛనంగా ప్రకటించాల్సి ఉంది. అయితే పాశ్వాన్, మాంఝీ వంటి నేతలు నితీష్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. సీఎం పదవిలో నితీష్ కొనసాగుతారని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా సోమవారంనాడు నితీష్ మంత్రివర్గం సమావేశమై త్వరలో గడువు తీరనున్న అసెంబ్లీని రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుంటుంది. అనంతరం నితీష్ తన రాజీనామాను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు సమర్పిస్తారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తారు.

# శ్రీ శివసాయి మందిరానికి ఆట పరికరాలు వితరణ

## ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ..

**తాడిపత్రి, నవంబర్ 16:**
స్థానిక సంజీవనగర్ 5వ రోడ్‌లో వెలసిన శ్రీ శివ సాయి మందిరానికి శాసనసభ్యులు జేసీ అస్మిత్‌రెడ్డి ఆటపరికరాలు అందించారు. వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకున్న శ్రీ శివసాయి మందిరం ప్రాంగణంలో చిన్నారులు ఆడుకునేందుకు శాసనసభ్యులు జేసీ అష్మిత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వారి స్వంత ఖర్చులతో దాదాపు 5 లక్షల రూపాయలు విలువ చేసే ఆట పరికరాలు వితరణ గావించారు. సాయి బాబా ఆలయానికి వచ్చే భక్తుల పిల్లలకు సౌకర్యాల కోసం ఆట పరికరాలు, ఊయలలు సాయిబాబా ఆలయానికి విరాళంగా అందించారు.



ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆందించిన



ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆందించిన ఆటవస్తువులు

# ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు

**కనేకల్, నవంబర్ 16:**
కురబ కులస్తుల ఆరాధ్య దైవం కనకదాసు 538 జయంతి వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక వీరనాగమ్మ కట్ట వద్ద నుండి పురవీధుల గుండా దిగువ గేరి వరకు కనకదాసు చిత్రపటాన్ని ట్రాక్టర్ లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. కన్యామనులు హారతులు చేత పట్టుకొని ఊరేగింపు ముందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కురబ కులానికి కనకదాసు చేపట్టిన అనేక అద్భుతమైన కార్యక్రమాలు చేశాడని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే మల్లికార్జున,ఆలూరి చిక్కన్న, తిప్పేస్వామి, ఆదినారాయణ, తిమ్మరాజు, గోవర్ధన్, చిక్కన్న, నరసింహులు,ఆంజనేయులు లింగమూర్తి,మంజు,అఖిల్, నితీష్, మహేష్ లతోపాటు అనేక మంది కురువ కులస్తులు పాల్గొన్నారు



కనకదాసు జయంతి ఊరేగింపు వేడుకల్లో పాల్గొన్న కురుబ కులస్తులు

# కొత్త రాయుడు స్వామి ఆలయ ధ్వజస్తంభానికి రూ.1.25 లక్షల విరాళం

**యాడికి, నవంబర్ 16 :**
యాడికి మండలం కమలపాడు పంచాయతీ చింతలాయి పల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి దేవాలయంలో (కొత్త రాయునీ స్వామి కొండలో ) నూతన ధ్వజస్తంభం నిర్మాణానికి యాడికి గ్రామానికి చెందిన గంగవరం పద్మనాభయ్య కుమారుడు సురేష్ బాబు రూ. 1.25 లక్షల విరాళం అందించారు. నూతన ధ్వజస్తంభం నిర్మాణానికి 12 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దీంతో పాటు వినాయకుడు, గరుడ విగ్రహాల ఏర్పాటు, కళ్యాణ వేదిక నిర్మాణానికి దాతల సహాయం కోరారు. దీంతో సురేష్ బాబు విరాళం అందించారు. వారి కుటుంబానికి శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. దాతలు విరివిగా విరాళాలు అందించాలని కోరారు.




ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం. శిధిలావస్థలో ఉన్న ధ్వజస్తంభం

# నయనానందకరం శ్రీ ఆలూరు కోన శ్రీరంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం

**తాడిపత్రి, నవంబర్ 16:**
మండల పరిధిలోని ఆలూరు కోనలో శ్రీ రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం భక్తులకు నయనానందకరంగా సాగింది. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర కార్తీక శుద్ధ ద్వాదశీలు ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీ ఆలూరు కోన శ్రీరంగనాథ స్వామి దివ్య క్షేత్రము నందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శేష తల్ప రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవము వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి శ్రీ రంగనాథ స్వామి కళ్యాణం వీక్షించి, శ్రీ రంగనాథ స్వామి కృపా కరుణ కటాక్ష వీక్షణములు పొంది, శ్రీవారికి మొక్కులు తీర్చుకొని, తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.



శ్రీదేవి, భూదేవిలతో శ్రీ రంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో శ్రీ ఆలూరు రంగనాథ స్వామి

### దైవభక్తిని పెంపొందించటమే

# కార్తీక వనభోజనాల విశిష్టత

## బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు.. పామిడిలో తవరలో శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం ఏర్పాటు ..

**పామిడి, నవంబర్ 16:**
దైవభక్తిని పెంపొందించి ప్రకృతిని అస్వాదిస్తూ బంధుమిత్రులతో కలిసి సంతోషంగా భోజనం చేయటమే కార్తీక వనభోజనాల విశిష్టత అని బలిజ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. కొండూరు రోడ్డులోని అడ్వకేట్ సతీష్ వ్యవసాయ తోటలో ఆదివారం బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బలిజ కులస్థులకు కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఉసిరి వృక్షానికి తులసి మాతకు పురోహితునిడు పెద్దఎత్తున సంకల్ప పూజలు చేశారు. ఉసిరిక చెట్టు పూజలు అత్యంత పుణ్య ప్రాధంగా హిందువులు భావిస్తారని తెలియజేస్తూ కార్తీకమాసంలో శివుడికి విష్ణువుకు ప్రత్యేక పూజలు చేస్తూ ఉసిరి చెట్టు కింద భోజనాలు చేయటం అత్యంత ముఖ్యమైందని ఇది ఆధ్యాత్మికత బౌతిక ప్రయోజనాలను అందిస్తుందన్నారు. ఇదిలావుండగా అక్కడ ఏర్పాటైన సభలో వివిద ప్రాంతాల నుండి తరలివచ్చిన బలిజ కులస్థులంతా కలిసి పట్టణంలో శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని నెలకొల్పేందుకు నిర్ణయించి అందుకనుగుణంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. బలిజ కులస్థుల సంక్షేమం వారి హక్కుల సాధనే మాకు ముఖ్యమని ఆదిశగా కలిసికట్టుగా ముందుకు సాగుతామని బలిజ సంక్షేమ సంఘం నాయకులు వెల్లడించారు.



ఉసిరి వృక్షానికి, తులసి మాతకు సంకల్ప పూజలు చేసిన దృశ్యం





మాట్లాడుతున్న బలిజ కులస్థుల సంక్షేమం నాయకులు. హాజరైన బలిజ కులస్థులు

# జనసంద్రమైన పంపనూరు ఆలయం

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు ..

**ఆత్మకూరు, నవంబర్ 16:**
మండల పరిధిలోని పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గ్రామం మొత్తం భక్తులతో నిండిపోయింది. భక్తులు రాకపోకల కోసం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో ఆలయానికి వచ్చిన భక్తులు కార్తీకదీపం వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. యాగముంటపంలో రాహు కేతు పూజలు చేయించారు. దర్శనానికి క్యూలో వేచి చూడాల్సిన పరిస్థితి కనిపించింది. ఆలయ సిబ్బంది పోలీసు సిబ్బంది క్రమ పద్ధతిలో భక్తులను దర్శించడానికి పంపే ఏర్పాటు చేశారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీ మంజునాథ స్వామి వాళ్లకు పంచామృత అభిషేకాలు ప్రత్యేక అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాన సమితి వారు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాబు, ఆలయ సిబ్బంది, పలువురు వాలంటీర్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి





కార్తీకదీపం వెలిగిస్తున్న భక్తులు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు




101 కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్ప స్వామి మాలాదారులు

# 101 కలశాలతో అయ్యప్ప స్వాముల శోభాయాత్ర

**యాడికి, నవంబర్ 16 :**
యాడికి మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటుకు అంకురార్పణ 101కశాలతో అయ్యప్ప స్వాములు శోభాయాత్ర నిర్వహించారు. ఆదివారం ఉదయం అయ్యప్ప స్వామి గుడిలో దాదాపుగా 101కశాలతో అయ్యప్ప స్వాములు అంతా కలిసి శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ వద్ద నుండి యాత్ర యాడికి గ్రామంలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయము. పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయము. శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అందరి దేవతలకు టెంకాయలు కొట్టి అన్నప్రసాద కార్యక్రమాన్ని మొదలుపెట్టారు సంక్రాంతి వరకు అయ్యప్ప స్వామి గుడిలో అయ్యప్ప మాలధారణ వేసిన భక్తులందరికీ మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం, రాత్రికి అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అయ్యప్ప స్వామి గుడి కమిటీ వారు తెలియజేశారు.

ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి హారతి పడుతున్న దృశ్యం



గర్భిణికి సీమంతం చేస్తున్న దృశ్యం

# గర్భిణీకి సీమంతం.. నిత్యావసరాల అందజేత

**అనంతపురం రూరల్, నవంబర్ 16:**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ నిర్మలమురళి ఆధ్వర్యంలో గర్భిణీ యమునకు సీమంతం చేశారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. పుట్టినిల్లు ఆశ్రమంలో ట్రస్ట్‌సభ్యులు రేజీ కురియన్ సహకారంతో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ పిల్లిగుండ్ల కాలనీకి చెందిన యమున, సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం ఆమె 9 నెలల గర్భవతి అన్నారు. అయితే వీరి ఆర్థిక పరిస్థితులను గమనించి రెండు నెలలకు సరిపడా 38 రకాల సరుకులు అందించామన్నారు. పుట్టినిల్లు ఆశ్రమంలో యమునకు సీమంతం చేసి, నిత్యావసరాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఆయురారోగ్యాలతో యమున సుఖ ప్రసవం జరగాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అవసరంలో ఆపదలో ఉన్నవారికి ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో సహాయం చేయాలని కోరారు. ఈ ట్రస్ట్ సభ్యులు శ్రీమతి భవాని, ఓబుళపతి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

**తాడిపత్రి, నవంబర్ 16:**
స్థానిక శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం ఉత్సవాలలో భాగంగా 26వ రోజున శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, ఇతర అభిషేకాలు గావించిన అనంతరం విశేష పుష్పాలతో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

# విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

**ఆత్మకూరు, నవంబర్ 16:**
ఆత్మకూరు మండలం గొరిదిండ్ల తండాకు చెందిన రైతు ఎరిస్వామి నాయక్ ఆవు ఆదివారం విద్యుత్ షాక్‌తో చనిపోయింది. ఆదివారం మధ్యాహ్నం 33 లెవెన్ కె.వి లైన్ తెగిపడి ఆవు మీద పడడంతో విద్యుత్ షాక్ తో అక్కడే చనిపోయింది. దీనితో లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని రైతు నాయక్ తెలిపారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు, పశువైద్యాధికారులు కూడా తెలిపిన ఏమి పట్టించుకోలేదని రైతు నాయక్ వాపోయాడు.



మృత్యువాత పడిన ఆవు

# హంద్రీనీవా కాలువలో ప్రభుత్వ వైద్యుడి గల్లంతు

**ఆత్మకూరు, నవంబర్ 16:**
పంపనూరు సమీపాన ఉన్న హంద్రీనీవా కాలువలో పడి ప్రభుత్వ వైద్యుడు కార్తీక్ రెడ్డి ఆదివారం అదృశ్యమయ్యాడు. బెలుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామానికి చెందిన కార్తీక్ రెడ్డి బెలుగుప్ప ప్రభుత్వాసుపత్రిలో వైద్యులుగా పనిచేస్తున్నాడు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా బంధుమిత్రులతో కుటుంబ సమేతంగా పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వచ్చి భోజనానంతరం హంద్రీనీవా కాలువ దగ్గరికి వెళ్లారు. కాలువకు ఇరువైపులా సిమెంట్ ప్లాస్టింగ్ చేసిన సమయంలో వేసిన మెట్ల మీదుగా కాలువలోకి దిగి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కాలువలో పడిపోయాడని అక్కడున్న పేర్కొన్నారు. సాయంకాలం 6 గంటల వరకు ప్రజలు భారీగా గుమికూడి కాలువ వెంట వెతికే ప్రయత్నం చేశారు. అయినా ఆచూకీ దొరకలేదు. బంధుమిత్రులు కాలువ దగ్గరికి వచ్చి రోధించడం కనిపించింది. కార్తీక్ రెడ్డి భార్య కూడా వైద్యురాలే. వారికి ఒక కూతురు ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు కాలువ వెంట వెతికే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.



కార్తీక్ రెడ్డి (పాత చిత్రం)

# వైఎస్సార్సీపీ నాయకుడు సూర్యనారాయణ మృతి

*నివాళులర్పించిన పార్టీ నేతలు..*

**బత్తలపల్లి, నవంబర్ 16:** మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. తమ పొలంలో పని చేస్తుండగా గుండెపోటుతో వైఎస్ఆర్సిపి నాయకుడు బోయపాటి సూర్యనారాయణ (45) మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం సూర్యనారాయణ ఆదివారం తన టమోటా పంటకు మందు పిచికారి చేస్తున్నారు. ఈ సమయంలో అనారోగ్యంగా, ఆయాసంతో ఇబ్బంది పడడంతో కొద్దిసేపు విరామం తీసుకున్నాడు. మళ్లీ పనికి వెళుతుండగా ఉన్నఫలంగా అక్కడే గొప్ప కూలిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిగా బత్తలపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. గుండెపోటుతోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, బీసీ సెల్ నాయకులు రామాంజనేయులు, ఎస్సీ సెల్ నాయకులు ముసలప్ప, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు ఈడిగ కాశప్ప, చల్లా కృష్ణమ నాయుడు, శ్రీనివాసులు, హరికుమార్, వెంకట్రాముడు, లింగమయ్య తదితరులు ఆసుపత్రికి చేరుకొని మృతునికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.



# నేడు జడే శంకరేశ్వర స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

*భక్తులు తరలిరావాలి..*
*యువభక్త బృందం పిలుపు..*

**అగళి, నవంబర్ 16:** మండల కేంద్రంలోని చోళ రాజుల కాలం నాటి పురాతన శ్రీ జడే శంకరేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు జై జై శంకరేశ్వర స్వామి యువ భక్త బృందం తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని జై జై శంకరేశ్వర స్వామి యువ భక్త బృందం పిలుపు నిచ్చారు. కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని స్వామి వారికి విశేషంగా పంచామృత అభిషేకం ప్రత్యేక పూలతో అలంకారం మహా నైవేద్యం సమర్పణ విశేష పూజ మహా మంగళ హారతి తీర్థప్రసాదం అన్న ప్రసాదం వినియోగం ఉంటుందన్నారు.



# స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, నవంబర్ 16:** స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కదిరి పట్టణం కస్తూరిబాయ్ బాలికల కళాశాలలో నిర్వహించిన పర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజిన్ థీమ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సమాజ పరిశుభ్రత ప్రాముఖ్యత పై అవగాహన కల్పించేలా ప్రజా భాగస్వామ్యంతో పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కమిషన్ డైరెక్టర్ పర్వీన్ బాను, మున్సిపల్ చైర్మన్ దిల్షాద్ ఉన్నీసా,వైస్ చైర్మన్ రాజశేఖర్ ఆచారి,పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, పట్టణ కౌన్సిలర్లు,వార్డు ఇంచార్జీలు,మున్సిపల్ శాఖ అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .



## పెద్దకోట్ల పెద్దమ్మకు

# వైభవంగా జ్యోతుల మహోత్సవం

### ముంపు గ్రామం నుంచి తరలివచ్చిన సాంప్రదాయం .. భక్తులతో కిటకిటలాడిన వడ్డెర కాలనీ ..

**బత్తలపల్లి, నవంబర్ 16:** ఊరు మారిన, నీరు నిండిన.. తరతరాలుగా వస్తున్న తమ నమ్మకాన్ని, సాంప్రదాయాన్ని వదలలేదు. చిత్రావతి రిజర్వాయర్ కారణంగా పెద్దకోట్ల గ్రామం ముంపునకు గురైనప్పటికి, బత్తలపల్లి వడ్డెర కాలనీకి వలస వచ్చిన వందలాది కుటుంబాలు బత్తలపల్లి కి వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అదేవిధంగా వడ్డెర కాలనీలో పెద్దమ్మ సుంకులమ్మ దేవాలయాలను అదునాతనంగా నిర్మించుకొని తమ ఆరాధ్య దైవం పెద్దమును ప్రతిష్టించి, తమ సాంస్కృతికి జీవం పోస్తూ వేడుకలను ప్రతి ఏటా వైభవంగా నిర్వహించు కుంటున్నారు. అందులో భాగంగానే, కార్తీక మాసంలో నిర్వహించే సాంప్రదాయ జ్యోతుల మహోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటి సభ్యులు, ప్రజలు భారీగా ఊరేగింపు నిర్వహించారు. కాలనీలో నుంచి ఊరేగింపుగా తరలివెళ్లి యల్లమ్మ కల్లును తీసుకొని వచ్చారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసం నందు పెద్దమ్మ దేవతకు రాత్రివేళల్లో జంతుబలులు చేయడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని, ప్రజలు సుఖసంతోషాలతో మెలగాలని కోరుకుంటూ బోనాలు పట్టినట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఆదివారం సుదూర ప్రాంతాల నుంచి వందలాదిమంది బత్తలపల్లిలోని పెద్దమ్మ, సుంకులమ్మ దేవతలను దర్శించుకునేందుకు వచ్చారు. రాత్రి జంతున్నలుల అనంతరం భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ, సుంకులమ్మ ఆలయ కమిటి సభ్యులతో పాటు కాలనీలోని పలువురు పెద్దలు పాల్గొన్నారు.



జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు అందుకున్న పెద్దమ్మ మూల విరాట్, సుంకులమ్మ మూలవిరాట్

# సంఘమేశ్వరక్షేత్రంలో కార్తీకమాస పూజలు

**బత్తలపల్లి, నవంబర్ 16:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంఘమేశ్వర క్షేత్రంలో చివరి ఆదివారం కార్తీక మాస పూజలను ఘనంగా నిర్వహించారు. క్షేత్రంలోని వివిధ ఆయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా చిత్రావతి నదిలో స్నానాలు ఆచరించి పంచలింగ శ్రీసంఘమేశ్వరుడు, గంగమ్మకు, ఏటి గంగమ్మకు కార్తీక దీపారాధన చేసి గంగలో వదిలి దర్శించు కున్నారు. శివాలయంలో పూజలు నిర్వహించుకున్నారు. ఆనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించారు. దీంతో ఆదివారం అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఆదేవిధంగా మాల్యవంతంలోని వీరనారాయణస్వామి ఆలయంలో సైతం కార్తీక మాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి వీరనారాయణ స్వామి, మాల్యకుంటప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళలు దీపాలు వెలిగించారు. ఆనంతరం పూలకుంట గ్రామానికి చెందిన కళావతి. నారాయణరెడ్డి నంద్యాల వారిచే శ్రీవిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11:30 వరకు వీరనారాయణ స్వామి, గంగమ్మ స్వామి కృపతో సంతానం లేని ఆడబిడ్డలకు వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు ఇలా వడిబియ్యం తీసుకున్న వారికి సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాడ నమ్మకం. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



విశేష పూజలు అందుకుంటున్న సంగమేశ్వర క్షేత్రంలో శివుడు

# వైకాపా నేత మక్బూల్ బాషా అరెస్టు అక్రమం

### కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్ రెడ్డి ..

**తనకల్లు, నవంబర్ 16:** వైసిపి కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ హిందూపురం వెళ్తున్న కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బిఎస్ మక్బూల్‌ని మార్గం మధ్యంలో లేపాక్షి చెక్ పోస్ట్ వద్ద నిలిపివేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని తనకల్లు మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ చర్యలు హిందూపురం లో వైసీపీ పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యన్ని కూని చేయమే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మమ్మ, తనకల్లు మండల వైఎస్ఆర్సీపీ రైతువిభాగ అధ్యక్షులు రమణ రెడ్డి, మండల కమిటీ సభ్యులు రాజారెడ్డి,ఉపాధ్యక్షులు కొండకమర్ల ముస్తఫా,%వఇ%సర్పంచ్ శంకర, ఇక్బాల్, ఎంపీటీసీ రమణ, జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ యం బి నరసింహులు, అమీర్, అయూబ్, చంద్ర నాయక్ ,లక్ష్మయ్య, శ్రీనివాసులు నాయక్, బాబ్ జాన్ , సుబ్రమణ్యం, రమణ, గంగన్న, ముసలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైకాపా నేత మక్బూల్ బాషాను అరెస్టు చేస్తున్న పోలీసులు



నిరసన తెలుపుతున్న కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్ రెడ్డి ..

# ప్రజాగళమే కలం

### విలేకరులకి సత్కారం .. తేనెతెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అంజినప్ప..

**బత్తలపల్లి, నవంబర్ 16 :** ప్రజా సమస్యలను ఎత్తుచూపుతూ, ప్రజాగళమే కలముగా పనిచేస్తూ, సమాజానికి సహకారాన్ని అందించే పత్రిక విలేకరుల కృషి అభినందనీయమని తేనెతెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కళాకారుడు శేషయ్యగారిపల్లి అంజినప్ప పేర్కొన్నారు. జాతీయ పత్రిక దినోత్సవంను పురష్కరించుకుని బత్తలపల్లి మండలంలోని పత్రికా విలేకరులను శ్రీ హరిహర పిరమిడ్ ధ్యాన మందిర కేంద్రంలో మండలంలోని పాత్రికేయులను శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజం నిప్పులాంటిది.దాన్ని నిర్భయంగా ప్రజల ముందు ఉంచే శక్తి కేవలం పత్రికా విలేకరులకే ఉంది. ప్రజాగలమే తమ కలముగా అహర్నిశలు ఆరాటపడే వారు విలేకరులు అని కొనియాడారు. జ్ఞాపికపై ముద్రించిన అంశాలను వారు ఉద్దేశాన్ని వివరిస్తూ, సంఘంలో సంస్కారం, సంస్కృతికి సంస్కారం, సమస్యలకు పరిష్కారం, ప్రతిభకు పురస్కారం, ప్రజలకు సహకారం ఈ ఐదు సూత్రాల ఆధారంగా విలేకరుల పనితీరు ఉంటుందని తెలిపారు.అనంతరం మండలంలోని పాత్రికేయులకు శాలువాకప్పి, మెమోంటోను అందజేసి ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్న పాత్రికేయులలో మదనాపు రామాంజనేయులు. మంజుల రాధాకృష్ణ, కప్పల హరికృష్ణ, మదనాపు కృష్ణాకర్, మదనాపు రాజశేఖర్, జాంపుల ఆజయ్ చౌదరి. సాకే శ్రీనివాసులు, మాతంగి రామాంజనేయులు, సాకే వన్నూరప్ప, జాంపుల అన్వేష్ తదితరులు ఉన్నారు. మిగిలిన పాత్రికేయులు మదనాపు శ్రీనివాసులు. యర్రగుంట చెన్నకృష్ణారెడ్డి, నెట్టెం మల్లికార్జున. బొమ్మినేని వెంకటచౌదరి, జాస్తి నాగరాజులు అందుబాటు లేకపోయారు. ఈ కార్యక్రమంలో ధ్యానమందిరం గురువు మండల నాగేంద్ర, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి,సీకేపల్లి కన్వీనర్ బొగ్గు రవిప్రసాద్, నార్పల మండల కన్వీనర్ యం.రవీంద్ర, శ్రీనివాసులు, మహేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.




బత్తలపల్లి మండల పాత్రికేయులను సన్మానిస్తున్న కళాభిషేకం అంజినప్ప

# ఘనంగా శ్రీ సిద్దేశ్వర స్వామికి రుద్రాభిషేకం

**అమరాపురం, నవంబర్ 16:** మండల పరిధిలో హేమావతి లో వెలసిన పురాతన కాలం నాటి దేవాలయం శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం శ్రీ సిద్దేశ్వర స్వామికి అర్చకులు రుద్రాభిషేకం, కుంకుమార్చన, వివిధ రకాల పూజలు చేశారు.. భక్తులు తెచ్చిన పూలతో శ్రీ సిద్దేశ్వర స్వామిని అలంకరణ చేసి, మహా మంగళహారతి తీర్థప్రసాదాలు వచ్చిన భక్తాదులకు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో %శ్రీ%మహిళలు శ్రీ సిద్దేశ్వర స్వామి కి దీపాలు వెలిగించి తమ మొక్కుబడును తీర్చుకున్నారు.



శ్రీ సిద్దేశ్వర స్వామికి పూలతో అలంకరణ





దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు. శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ.

# యూనిటీ మార్చ్‌లో పాల్గొన్న శాసనసభ్యులు కందికుంట

**కదిరి, నవంబర్ 16:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించిన యూనిటీ మార్చ్‌లో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఏకతా మార్చ్" ద్వారా దేశవ్యాప్తంగా ఏకత్వ భావనను దేశభక్తిని పటిష్టం చేయడంతో పాటు "వికసిత భారత్ –ఆత్మనిర్భర భారత్"స్వప్నంగా తీసుకున్న సంకల్పాన్ని దేశ ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడానికి కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సమగ్రత, ఏకత్వం భావనలు వికసిత భారత ప్రయాణానికి బలమైన పునాదులుగా మారనున్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యేని అధ్యాపక బృందానికి, సీఐని ఘనంగా సన్మానించారు. యూనిటీ ర్యాలీని శాసనసభ్యులు వెంకటప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు.




# శుభకార్యంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల

**అగళి, నవంబర్ 16 :** అగళి ఆర్కే కళ్యాణ మండపంలో జరిగిన టీడీపీ నాయకురాలు పుట్టమ్మ కుమార్తె వివాహ వేడుకలు శని, ఆదివారం జరిగాయి. ఈ శుభకార్యంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీతో పాటు మండల నాయకులు అందరికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వీరి వెంట మండల నాయకులు జడ్పిటిసి ఉమేష్, మాజీ మండల కన్వీనర్ సౌకత్, మాజీ సర్పంచ్ శివలింగప్ప, క్లస్టర్ కో కన్వీనర్ కమ్మరి శివన్న, సింగల్ విండో డైరెక్టర్ శివప్ప,ఎస్సీ సెల్ భూతరాజు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప, పాత్రికేయులు తిమ్మరాజు హనుమంతరాయుడు, సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు



గుండుమల, మండల నాయకులను సన్మానిస్తున్న దృశ్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# శ్రీవారిని దర్శించుకున్న కొత్త తిరుపతి ఆలయ ధర్మకర్త గోవిందరాజు

**రోళ్ల, నవంబర్ 16 :** రోళ్ల మండలం కొత్తపాళ్యం గ్రామంలో శ్రీవారి దేవాలయాన్ని నిర్మించిన వ్యవస్థాపకులు గోవిందరాజు ఆదివారం తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి ని, శ్రీ పద్మావతిఅమ్మవారి ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, తిరుపతి ఎస్ పి సుబ్బారాయుడు, సీవీ ఎస్ ఓ మురళికృష్ణ తో కలిసి దర్శించుకొన్నారు. తోలుతా శ్రీవారిని దర్శించుకొన్న వారు అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారి ని దర్శించుకొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కుటుంబ సభ్యులు, తిరుపతి ఎస్ పి కుటుంబ సభ్యులు, సీవీ ఎస్ ఓ మురళికృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని, పద్మావతిని దర్శించుకొన్నారు.



శ్రీవారి దర్శనంలో గోవిందరాజు, సజ్జనార్, సుబ్బారాయుడు, మురళికృష్ణ కుటుంబ సభ్యులు



శ్రీవారి దర్శనంలో పోలీస్ కమిషనర్ సజ్జనార్ కుటుంబ సభ్యులు. శ్రీవారి ని దర్శించుకొన్న కొత్త తిరుపతి దేవాలయ ధర్మకర్త గోవిందరాజు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్. పద్మావతి అమ్మవారిని దర్శించుకొన్న గోవిందరాజు, సజ్జనార్, సుబ్బారాయుడు, మురళికృష్ణ కుటుంబ సభ్యులు

## కర్తార్ సింగ్ సరాభా వారసత్వాన్ని కొనసాగిస్తాం

### డీవైఎఫ్ఐ నాయకులు..

**పెద్దకడబూరు, నవంబర్ 16 :**
అందరికీ విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు, కేవీపీఎస్ మండల కార్యదర్శి దేవదాసు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దకడబూరు గ్రామంలో వెలసిన కర్తార్ సింగ్ సరాభా 110వ వర్ధంతి సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం 19 ఏళ్ల వయస్సులోనే దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీరుడు కర్తార్ సింగ్ సరాభా అని కొనియాడారు. పంజాబ్ రాష్ట్రంలోని లూదియనాలో పుట్టిన కర్తార్ సింగ్ అతి చిన్న వయసులోనే ఉన్నత విద్యను అభ్యసించి అమెరికా నుంచి గదర్ పార్టీలో చేరాడని తెలిపారు. బ్రిటిష్ సామ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అని ప్రశంసించారు. నిరుద్యోగం రోజు రోజుకు పెరుగుతోందని పాలకులు నిర్లక్ష్యం వీడి ఉపాధి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలసలు నివారించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున డివైఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు బాలు, అశీర్వాదం, పౌలు, గుండన్న, ప్రభు, బెంజిమన్, బాబు, మోజేస్, దావీదు, లోకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు

## పెద్దకడబూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

### రోగుల నుంచి విశేష స్పందన..

**పెద్దకడబూరు, నవంబర్ 16 :**
పెద్దకడబూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్) నందు ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, సొసైటీ చైర్మన్ మీ సేవ ఆంజనేయులు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బొగ్గుల నరసన్న కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో 155 మందికి డాక్టర్ హేమంత్ కుమార్ తో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 50 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఎమ్మిగనూరులోని ఆర్కే కంటి వైద్యశాలకు రెఫర్ చేశారు. ఆర్కే కంటి వైద్యశాలలో ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా 50 మంది రోగులకు కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో ఆనందరావు, ఆర్కే కంటి వైద్యశాల సిబ్బంది లక్ష్మీ, సౌజన్య, వీరవతి, శివ, రాజేష్, హనుమంతు, ఇక్బల్, అనంతకుమార్ పాల్గొన్నారు.




కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమంత్ కుమార్



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు





రోగులకు ఓపీ రాస్తున్న ఆర్కే కంటి వైద్యశాల సిబ్బంది. రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## ననియాలలో జంట ఏనుగుల హల్ చల్

**రామకుప్పం, నవంబర్ 15:**
మండలంలోని ననియాల అటవీ సమీప ప్రాంతమైన రైతులు పండిస్తున్న పంట పొలాల్లోకి జంట ఏనుగులు ఆదివారం రాత్రి హల్ చల్ చేస్తున్నాయి. ఏనుగుల ట్రాకర్లు, అటవీ సిబ్బంది టపాకాయలు బాణాసంచా పేల్చుతూ అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ననియాల ,ననియాల తాండ గ్రామాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరు బయట రాకుండా ఇంటికి పరిమితం కావాలని, తమ పంట పొలాలకు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



ననియాలలో ఏనుగుల సంచారం

## ఘనంగా జనజీవన స్రవంతి పుస్తకావిష్కరణ

**ఆదోని, నవంబర్ 16:**
ఆదోనిలో నేతాజీ కంప్యూటర్ ఇన్స్టిట్యూషన్ కార్యాలయంలో ప్రముఖ కవి సోప్‌గారి వీరన్న రచించిన జనజీవన స్రవంతి పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆవుల బసప్ప అధ్యక్షత వహించగా విశ్రాంత తహసీల్దార్ షేక్షావలి సమీక్షకులుగా వ్యవహరించారు. డాక్టర్ చక్రి భాస్కర్ పుస్తకావిష్కరణ చేశారు. ముఖ్య అతిథులుగా కౌతాళం కోపరేటివ్ బ్యాంకు రిటైర్డ్ సెక్రటరీ కే.మారుతి మోహన్, ఆలూరు విశ్రాంత గ్రంథాల అధికారి ఎన్ వెంకటేశ్వర్లు హాజరైనారు. విశిష్ట అతిథులుగా తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి.నల్లారెడ్డి, నేతాజీ కంప్యూటర్ ఇన్స్టిట్యూషన్ అధినేత నర్సప్ప హాజరైనారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ వీరన్న 75 పుస్తకాలు రచించారన్నారు. అందులో వివిధ సాహితీ ప్రక్రియల పుస్తకాలు ఉన్నాయన్నారు. జనజీవన స్రవంతి పుస్తకం ఓ ఆణిముత్యం లాంటిదన్నారు. సమాజంలో కులమాత వర్గ విభేదాలు తీవ్రమయ్యాయని, అది మంచి పద్ధతి కాదని గొర్రెలన్నీ ఒక జాతి కాకులను ఒక జాతి కుక్కలన్నీ ఒక జాతి నక్కలన్నీ ఒక జాతిగా ఎలా ఉన్నాయో మానవులంతా కూడా ఒకే జాతిని కుండ చేస్తే కుమ్మరి కట్టి చేస్తే కమ్మరి అన్నట్లు ఈ విధంగా కులాలు ఏర్పడ్డాయని నిజానికి మానవులంతా ఒకే కులము అది మానవకులము అది మానవజాతిగా భావించాలని ఆ విధంగా ఏర్పడిన కులాల్లో మాది చిన్న కులము మాది పెద్ద కులము మేము ధనవంతులము మీరు ధనహీనులు అనేవి పేద భావాలతో మెలిగే ఒకరినొకరు దూరంగా ఉంచుకోవడం మంచిది కాదనే ఉద్దేశంతో రచయిత ఈరన్న జనజీవన స్రవంతిలో మీరంతా కలిసిపోండి ఉన్న కొన్నాళ్లు జీవితంలో ఇలాంటి భేదభావాలు ఎందుకు అనేటువంటి జ్ఞానోపదేశాన్ని నేటి సమాజానికి అందించడం ఎంతో శుభదాయకమని తెలియజేశారు. ఇలాంటి రచనలు ఈరన్న ఎన్నో రచించి సామాజిక హితం కోసం పాటుపడాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా కవులు రచయితలు కూడా సమాజంలో నైతికవులను పెంపొందించే పుస్తకాలను ఎన్నో రచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ పుస్తకాల రచనలకు అటు ప్రభుత్వం వారు ఇటు కళాపోషకులు ఆర్థిక సహకారం అందించాలని అప్పుడే మంచి సమాజ నిర్మాణం ఏర్పడుతుందని వక్తలు తెలియజేశారు




జనజీవన స్రవంతి పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

## భక్తులతో నిండిన శ్రీశైలం పురవీధులు

**శ్రీశైలం, నవంబర్ 16**
జ్యోతిర్లింగ క్షేత్రం, శక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీశైలం మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిలను కార్తీక మాస చివరి రోజులుకావడంతో దేశ నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం తరలివచ్చారు. పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు వేకువ జామున్ నుండే క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ఆలయ వేళలో మార్పులు చేశారు.సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. భక్తులు ఇబ్బంది పడకుండా భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు క్యూ లైన్ లో వేచి ఉన్న భక్తుల సౌకర్యం అల్పాహారము పాలు బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తులందరూ కూడా స్వామి అమ్మవారిని దర్శించుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు సుమారు 60 వేలకు మంది పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా.



శ్రీశైలంకి పోటెత్తిన భక్తులు



స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

## సత్య సాయి బాబా జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ..


**పుట్టపర్తి, నవంబర్ 16:**
ఈనెల 19 నుండి 23 వరకు పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా జరిగే కార్యక్రమాలను ప్రజలు భక్తాదులు మరియు పాత్రికేయ సోదరులు తమ వంతు సహకారాలు అందించి వేడుకలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ కోరారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో మీడియా ప్రతినిధులతో పాత్రికేయ సమావేశం నిర్వహించి పలు విషయాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పుట్టపర్తిలో శ్రీ సత్య సాయిబాబా శతజయంతి వేడుకలు ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో భక్తజనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో పాటు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మరియు పోలీసు యంత్రాంగం ద్వారా సమన్వయ సహకారాలతో ప్రభుత్వపరమైన పనులను పూర్తి చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. దేశ విదేశాల నుండి వచ్చే భక్తాదులకు అన్ని సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందస్తు చర్యలను తీసుకొని ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు. జయంతి వేడుకల నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 19న గౌరవ దేశ ప్రధాని నరేంద్ర మోది రానున్నారని, అలాగే భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హర్యానా మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితర ప్రముఖులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ సూత్రప్రాయంగా తెలిపారు.

## గౌడనకుంట శ్రీ కెంచమాంబ దేవికి కార్తీక మాస పూజలు

**అమరాపురం, నవంబర్ 16 :**
అమరాపురం మండల పరిధిలోని తమ్మడే పల్లి పంచాయతీ గౌడనకుంట గ్రామంలో పురాతన కాలం నాటిన వెలసిన శ్రీ కెంచ మాంబ దేవికి కార్తీక మాసం సందర్భంగా భక్తాదులు అమ్మవారికి విశేష పూజలను వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇంటి నుండి కళాశాలతో డబ్బు వాయిద్యాలతో అమ్మవారి ఆలయం చేరుకున్నారు.ఈ సందర్భంగా శ్రీ కెంచమాంబ దేవి కి పంచామృత అభిషేకం, తమలపాకు పూజ, కుంకుమార్చన, షాడ చోకచారం, నవగ్రహ పూజలు భక్తులు తెచ్చిన వివిధ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ అర్చకులు చిదానంద స్వామి, చే విశేష పూజలను నిర్వహించారు.. కార్తీక మాస ప్రత్యేక పూజలను గౌడనకుంట గ్రామానికి చెందిన మూలెమనే ఈరన్న కుటుంబ సభ్యులు, వస్తాదులు నిర్వహించారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



శ్రీ కేంచమాంబదేవికి పూలతో అలంకరణ

అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు మరియు దేవాలయ యజమానుల ఆధ్వర్యంలో మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలను వినియోగించారు. వచ్చిన భక్తులకు మూలెమనే ఈరన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు.





పూజలు నిర్వహిస్తున్న భక్తులు. దీపాలను వెలిగిస్తున్న మహిళలు

## సమ సమాజ నిర్మాణమే శ్రీ భక్త కనకదాసు లక్ష్యం

### ఘనంగా శ్రీ భక్తకనకదాసు జయంతి వేడుకలు .. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కే. హరిప్రసాద్..

**రొళ్ల, నవంబర్ 16 :**
శ్రీ భక్త కనకదాసు 518 జయంతిని పురస్కరించుకొని హిందూపురంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొనగా ఇందులో భాగంగా లేపాక్షి మండలం చోళ సముద్రం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవి రచయిత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హరిప్రసాద్ తను స్వీయ రచన చేసిన శ్రీ భక్త కనకదాసు జీవిత చరిత కవిత పాటలాగా రాసి కురుబ కులస్తులకు శ్రీ భక్త కనకదాసు గొప్పతనాన్ని జీవిత రహస్యాన్ని పోరాట తత్వాన్ని భక్తి తత్వాన్ని సమాజం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని అందరికీ చేరవేయాలనే తపనతో కరపత్రాలు రూపంగా హరిప్రసాద్ అందజేశారు. కురుబ హరిప్రసాద్‌ని కురుబ కులస్తులు అభినందించారు ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ మంచి అన్నది మానవత్వం అయితే అందరూ స్వీకరించాలని కోరారు అందులో భాగంగానే కురువ పెద్దలకు కనకదాసు వేషదారి అయినా బీదరప్పకు కూడా కనకదాసు జీవిత చరిత్ర పాటను హరిప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు గోరవయ్యల ఆటపాటలు ఆచార సాంప్రదాయాల ఉనికిని తెలిపే కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి . ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ భక్త కనకదాసు జీవిత చరిత్ర కవిత పాట తన తల్లిదండ్రులైన కీర్తిశేషులు స్వర్గీయ లక్ష్మీదేవి అమ్మ గారికి అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.



శ్రీ భక్త కనకధాస జీవిత చరిత గీతాన్ని కురుబ పెద్దలకు అందజేస్తున్న దృశ్యం



కనకదాసు వేషం వేసిన బిదరప్పకు కనకదాసు పాటను అందజేస్తున్న హరి ప్రసాద్

నాన్నగారు,నంజప్ప, గంగాధర్, సహకారంతో దేవుని ఆశీస్సులతో గురువుల ఆశీస్సులతో ఇటువంటి పాటలు రాసినట్లు తెలిపారు. నేటి తరానికి రేపటి తరానికి శ్రీ భక్త కనకదాసు ఆదర్శప్రాయులని హరిప్రసాద్ గుర్తు చేశారు. ఆ మహనీయుల బాటలోనే అందరూ పయనించాలని హరిప్రసాద్ పిలుపునిచ్చారు ఆచారాలు సంప్రదాయాన్ని మానవ జీవనానికి పట్టుకొమ్మలు అని హరిప్రసాద్ పేర్కొన్నారు.

## అప్పులబాధతో రైతు ఆత్మహత్య

**దువ్వూరు, నవంబర్ 16:**
దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన మామిళ్ల సుబ్బరాయుడు( 67 ) తండ్రి బాల నరసింహులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతను 10 ఎకరాలలో సొంత వ్యసాయభుమి మరియు కొంత కౌలుకు భూమి తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. గత 5 సంవత్సరాల నుండి వ్యసాయం లో రాబడి రాక సుమారు 10 లక్షల రూపాయలు బాకీ అయ్యాయి. పంటల కోసం తెచ్చిన చోట అప్పులు తీర్చలేక ఈనెల 4వ తారీఖు 5 సాయంత్రం తన ఇంటిలో గడ్డికి కొట్టే మందు త్రాగినాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతని కర్నూలు జనరల్ ఆసుపత్రి తీసుకెళ్లారు. కర్నూలులో చికిత్స పొందుతూ15వతేదీ రాత్రి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు దువ్వూరు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సుబ్బరాయుడు(ఫైల్ ఫోటో)

## రాయలసీమ ఊపిరి, అస్తిత్వమే శ్రీబాగ్ ఒడంబడిక

### రౌండ్ టేబుల్ సమావేశం..

**దువ్వూరు, నవంబర్ 16:**
రాయలసీమ ఊపిరి, అస్తిత్వమే శ్రీబాగ్ ఒడంబడిక అని పలువురు వక్తలు అన్నారు. శ్రీ బాగ్ ఒప్పందం జరిగి 88 సంవత్సరాలు కావస్తున్న ఈ సందర్భంలో అనంతపురంలోని ప్రెస్ క్లబ్‌లో ప్రజాఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. . ముందుగా పప్పూరు రామాచార్యులు, కల్లూరు సుబ్బారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి 100 టిఎంసి రామాంజనేయులు అధ్యక్షత వహించగా..శ్రీ బాగ్ ఒప్పందం ప్రాధాన్యత, చారిత్రక నేపద్యాన్ని వేమన అధ్యయన వేదిక నాయకులు అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి వివరించారు. రాయలసీమ కథా రచయిత బండి నారాయణస్వామి భౌగోళిక, సాంస్కృతిక, రాజకీయ రాయలసీమ నేపథ్యాన్ని, అవసరాన్ని నొక్కిచెప్పారు. జలసాధన సమితి నాయకులు అడ్వకేట్ రామ్ కుమార్ రాయలసీమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని, వివక్షతను తెలియజేశారు. కోస్తాంధ్ర నాయకులు కృష్ణ, తుంగభద్ర జలాలను రాయలసీమకు కాకుండా ఏ విధంగా కోస్తాకు తరలించారు, అందులోనూ రాయలసీమ కోల్పోయిన భూభాగాలను, ఖనిజ, నీటి వనరులను ఏ విధంగా కోల్పోయింది, దీని వల్ల జరిగిన నష్టాన్ని చాలా వివరణాత్మకంగా తెలియజేశారు. శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు రావాల్సిన రాజధాని కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు, అలాగే ఇతర ప్రాజెక్టులు ఏ విధంగా రాయలసీమ కోల్పోయిందనేది తెలియజేశారు. రాయలసీమ సాధించాల్సిన అనేక హక్కులను, అవసరాలను తెలియజేశారు. రాయలసీమలోని ప్రజానీకం గతం కన్నా నేడు ఎంతో చైతన్యవంతమై ఆలోచిస్తోంది. ఈ చైతన్యం మరింత లోతుగా విద్యార్థులు, యువకులు, అన్ని రకాల ప్రజలలోకి వెళ్లి బలమైన ఉద్యమ రూపం తీసుకున్నప్పుడు రాయలసీమ హక్కులు, ఆకాంక్షలు నెరవేరుతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రజా కళామండలి నాయకులు, రాయలసీమ విద్యావంతులు వేదిక, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అనంత హక్కుల పోరాట సంఘం సోమర రాహుల్, తెలుగు వెలుగు టీవీ రెడ్డి, ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వేమన, రాయలసీమ యువ నాయకులు అశోక్ రెడ్డి మరియు ఎస్కేయూ రామాంజీ, మేధావులు, పాల్గొన్నారు. రాయలసీమ ఉద్యమానికి తమ మద్దతులను సంఘీభావాన్ని ప్రకటించారు.




# చల్లాకు యాదవ సంఘం సత్కారం

### కార్తీక వనసమారాధనలో పాల్గొన్న చల్లా రాజగోపాల్ యాదవ్.. చల్లా రాజగోపాల్‌కు సత్కారం ..

దువ్వూరు, నవంబర్ 16:
ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు గ్రామంలో యాదవ సంఘం పెద్దల సహకారంతో, యాదవ యువజనసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ అమ్మవారికి అభిషేకం, ఉసిరిచెట్టు పూజ, గోపూజ, శివలింగ పూజ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు శ్రద్ధభక్తులతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరు పట్టణ టిడిపి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని మరింత భక్తిమయంగా మార్చారు. అనంతరం యాదవ సంఘ పెద్దలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ కార్తిక వనభోజనం మహా పుణ్యకార్యమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు .ఈ పుణ్య కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆ దేవుని కృప ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బూరి గంగయ్య యాదవ్, మద్దిగారి వేణుగోపాల్ యాదవ్, అవులరాజ యాదవ్, గుడిపాటి సుబ్బరాయుడు యాదవ్, గుజ్జల నారాయణ యాదవ్, డాక్టర్ వేణుగోపాల్ యాదవ్, గొర్ల నరసింహారావు యాదవ్, మర్రిబోయిన ఓబయ్య యాదవ్, వంశీ యాదవ్, గుజ్జల రమేష్ యాదవ్, పెరుమల్ల సుబ్బరామయ్య యాదవ్, నల్లమేకల సురేంద్ర యాదవ్, బొబ్బూరి రాముడు తదితర యాదవ సంఘ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగమ్మ వారి దివ్య ఆశీస్సులు పొందారు.



చల్లా రాజగోపాల్ యాదవ్‌ను సన్మానిస్తున్న కల్లూరు యాదవ సంఘం పెద్దలు



కల్లూరులోని గంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న చల్లా రాజగోపాల్ యాదవ్

## శ్రీ మద్దెమ్మ శ్రీ నాగమ్మ దేవతకు నేడు లక్ష దీపోత్సవం

**అమరాపురం, నవంబర్ 16:**
మండల పరిధిలో తమడేపల్లి పంచాయితీ దేవగానపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ మద్దమశ్రీ నాగమ్మ దేవతలకు కార్తీక మాసం సోమవారం ప్రత్యేకంగా లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం సభ్యులు తెలిపారు. లక్షద్వీపోత్సవ కార్యక్రమానికి శ్రీ శ్రీ హనుమంతనాథ స్వామి కొరటి గెర మహాసంస్థానం మఠం ఏలేరాంపురం. కోరట గేర నియోజకవర్గం తుంకూరు జిల్లా కర్ణాటక రాష్ట్రం. నుంచి కార్యక్రమానికి హాజరవుతారని శ్రీ మద్దెమ్మ, నాగమ్మ దేవి దేవస్థానం సభ్యులు తెలిపారు. . లక్ష దీపోత్సవాల్లోభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కుబడులు తీర్చుకోవాలని వారు కోరారు.



శ్రీ మద్దెమ్మ దేవికి పూలతో అలంకరణ





శ్రీ మద్దెమ్మ దేవి దేవాలయం. శ్రీ నాగమ్మ దేవి దేవాలయం

# ఘనంగా బి.ఎన్. రెడ్డి 126వ జయంతి వేడుకలు

### అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి ..

**దువ్వూరు, నవంబర్ 16:**
దువ్వూరులో డాక్టర్ బి.ఎన్.రెడ్డి 126వ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ బి.యన్.రెడ్డి 1908వ సంవత్సరం నవంబర్ 16 వ తేదీన వైయస్సార్ కడప జిల్లా పులివెందుల తాలూకా కొత్తపల్లి గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించారన్నారు. తన తండ్రి వ్యాపారం చేస్తూ మద్రాసులో ఉండగా మద్రాసులో పెరిగిన బి.ఎన్.రెడ్డి చదువుకునే రోజుల్లోనే నాటకాలలో వేషాలు వేసే వారు.వరవిక్రయం నాటకంలో ఆయన ప్రతిభను ప్రత్యక్షంగా చూసిన మహాత్మా గాంధీ ఆయనను ప్రత్యేకంగా ప్రశంసించారు. కలకత్తా వెళ్లి శాంతినికేతన్ లో కొంత కాలం గడిపారు.అక్కడ అయన లలిత కళల పట్ల విశేషంగా ఆకర్షితులయ్యారని తెలిపారు. బెంగాలీలో సీత అనే సినిమా చూశాక సినిమాలు తీయాలని తనకు కోరిక కలిగిందని బి.యన్.రెడ్డి చెప్తుండేవాడు అని అన్నారు. ఆయన మొదటి నుండి చివరి వరకు విలువల పట్ల తనకున్న నిబద్ధతను వీడలేదు. బి.ఎన్.రెడ్డి సినీ పరిశ్రమలో నిర్మాతగా ఎన్నో సినిమాలు తీసి మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన 1941 లో తీసిన దేవత సినిమా దక్షిణ భారతదేశ మంతటా సంచలం సృష్టించింది. ఇలా ఎన్నో సినిమాలు తీశారన్నారు. దాదా ఫాల్కే అవార్డు పొందిన దక్షిణ భారతదేశంలో మొదటి వ్యక్తి బియన్ రెడ్డిఅని జగన్మోహన్ రెడ్డి తెలిపారు. అలాంటి మహానుభావుని జయంతిని మనం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రెడ్డి సంఘం నాయకులు అమ్మిరెడ్డి రాజగోపాల్ రెడ్డి , బండి మల్లేశ్వర్ రెడ్డి , బుసా రమణారెడ్డి,జొన్నవరం యంగమాంబ రెడ్డి , జొన్నవరం పోతుల వీరారెడ్డి , ముదుమాల మల్లేశ్వర రెడ్డి , కోరా శివరామిరెడ్డి, కోరా రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బి.ఎన్. రెడ్డి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



జాతీయ జర్నలిస్ట్‌ల దినోత్సవం నిర్వహిస్తున్న పాత్రికేయులు

## శ్రీ నీలమణి దుర్గ పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ జర్నలిస్ట్‌ల దినోత్సవం

**పాతపట్నం, నవంబర్ 16:**
పాతపట్నం మండల కేంద్రంలో శ్రీ నీలమణి దుర్గ పాత్రికేయ సంఘం అధ్యక్షుడు కట్టా మోహన్ ఆధ్వర్యంలో జాతీయ పాత్రికేయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాత్రికేయులందరూ ఒకరికొకరు శుభాకాంక్షలను తెలుపుకున్నారు. కేక్ కోసి పంచారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కట్టా మోహన్ మాట్లాడుతూ నియోజక వర్గం దశ, దిశను మార్చే శక్తి మన పాత్రికేయులకు ఉందని, యధార్థ సంఘటనల అన్వేషణ కోసం పరుగెత్తే అడుగులు, వాస్తవాలను వెలుగులోకి తెచ్చి కష్టాలను ఎన్ని ఎదురైనా కలం ఆగదన్నారు. సమాజం లో అవినీతి, అక్రమాలను వెలికి తీసి, పారదర్శకమైన సమాజ స్థాపన లో ప్రధాన భూమిక పోషిస్తూ, విధి నిర్వహణ లో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, ఫోర్త్ ఎస్టేట్ గా ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్న జర్నలిస్టుల కష్టాలను ప్రభుత్వం, స్థానిక పాలకులు రాజకీయ నాయకులు గుర్తించి జర్నలిస్టుల కు తోడుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శేఖర్, రాజేష్ , శ్రీధర్,కోట్నీ శ్రీను,శ్రీనివాస్ జగన్, నరేష్, రమేష్, అనీల్, సుధాకర్ పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.



జాతీయ జర్నలిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా మిఠాయిలు పంచుకుంటున్న పాత్రికేయులు

# ఘనంగా 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు

**రొళ్ల, నవంబర్ 16 :**
స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం 72వ అఖిలభారత సహకార వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు దాసరెడ్డి,రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ వి.యం పాండురంగప్ప, తెదేపా మండల కన్వీనర్ జి.కె ఈరన్న,సింగల్ విండో డైరెక్టర్ భరత్,హాజరై కార్యాలయం ముందు పథకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14న మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా 20వ తేది వరకు వారం రోజులపాటు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈనెల 16న వ్యవస్థాపకత ఉపాధి కల్పన నైపుణ్య పెంపొందించడంలో సహకార అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ ప్రముఖపాత్ర వహించాలన్నారు.ముఖ్యంగా రైతులకు సహకార సంఘంలో రుణాలు గురించి పేద ప్రజలకు చేరవేయడంలో సహకార సంఘాలు సాదకాలుగా పని చేస్తాయని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఈవో హనుమంతరాయప్ప,మాజీ ఎంపీపీ కృష్ణప్ప,తెదేపా బీసీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు తెదేపా బిసి సెల్ మండల ఉపాధ్యక్షుడు కల్లురోప్పం రవికుమార్ నియోజకవర్గ తెలుగు యూత్ ఉపాధ్యక్షుడు పంచాయతీ అధ్యక్షులు నాగేంద్ర,మండల తెలుగు యువత అధ్యక్షులు యూనిట్ ఇంచార్జ్ లు హేమంత్ కుమార్,మీ సేవా వెంకటేష్,నాయుకులు బ్యాంక్ బాలరాజు,రామచంద్రప్ప, మూర్తి, సిబ్బంది తిప్పేస్వామి, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.



సహకార వారోత్సవల్లో పాల్గొన్న నాయకులు

# బీహార్ గెలుపుతో ఎన్‌డీఏ ప్రభంజనం

### బీజేపీ కార్యకర్తల విజయోత్సవ సంబరాలు.. డా. సలాన శరత్‌కుమార్..

**మెలియాపుట్టి, నవంబర్ 16**
బీహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ సాధించిన ఘన విజయం దేశవ్యాప్తంగా ఎన్డీయే ప్రభంజనాన్ని మరోసారి స్పష్టంగా చాటిందని పాతపట్నం నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త డా. సలాన శరత్‌కుమార్ అన్నారు. ఆదివారం మెలియాపుట్టి మండలం మూడు రోడ్ల కూడలిలో బీజేపీ కార్యకర్తలతో కలిసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "బిహార్ విజయంతో దేశ ప్రజలు మరోసారి అభివృద్ధి, స్థిరత్వం, శక్తివంతమైన నాయకత్వం పట్ల నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రానున్న 2029 సాధారణ ఎన్నికల్లో కూడా బీజేపీ ప్రభంజనం తప్పదని స్పష్టమైంది. మోదీ నాయకత్వంలోనే దేశ అభివృద్ధి సాధ్యమని దేశంలోని ప్రతి రాష్ట్రం విశ్వసిస్తోంది" అన్నారు.అలాగే నూతన రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ బాధ్యతలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం మరింత పెరిగిందనీ, గ్రామస్థాయి వరకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం జై బీజేపీ - జై మోదీ నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సలానా రాఘవరావు, మండల అధ్యక్షులు రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వనజంగి రమేష్, మాజీ మండల అధ్యక్షులు నక్క వెంకట్రావు తదితరులతో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

# భక్తిమార్గంలో సమాజ సేవకు శ్రీకారం చుట్టిన తత్వవేత్త శ్రీ భక్త కనకదాసు

**రొళ్ల, నవంబర్ 16 :**
శ్రీ భక్త కనకదాసు భక్తి పారవశ్యంతో సమాజ సేవకు శ్రీకారం చుట్టిన గొప్ప తత్వవేత్త వాగ్గేయకారుడు, కవి, పోరాటయోధుడు అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేపాక్షి మండలం చోళసముద్రం ప్రాథమిక పాఠశాలప్రధానోపాధ్యాయులు శ్రీ కె హరిప్రసాద్ అన్నారు. శ్రీ భక్త కనకదాసు 518వ జయంతి సందర్భంగా భక్త కనకదాసు జీవితచరిత కవిత శీర్షికన పాట రూపంలో ఆయన కనకదాసు జీవిత చరితను కవితగా ప్రజలకు అందించారు.

కురుబల కులదైవమై వెలిగిన ఓ కనకదాసువో
కులాల ఆత్మల పాలిట పరమాత్మగావెలిగిన ఓ హరిదాసువో...
మానవ ధర్మం మానవత్వం
మనుషులకర్థం సమ సమాజం అంటూరేపటి భవితకు చరితకు నవతకు యువతకు
శ్రీకారం చుట్టిన ఓ కనకదాసుడా...
కర్ణాటకనా ధారువాడ బాడాలోనా
బీరప్ప బచ్చమ్మలకు తిమ్మప్పగా పుట్టి నీవు ...
చేతిలోన చిడతలు బట్టి
మెడలోన తంబుర దాల్చి
భుజముపై గొర్రె ఉన్ని కంబళి కప్పి మనసు విప్పి మాట కలిపి సాయుధ పోరాటమే సలిపి తిమ్మనాయుడివై వెలిగి నీవు
విజయనగర రారాజులకీర్తిలో కనకదాసువై నిలిచావయ్యా...
హలంపట్టి పొలం దున్ని చేతి కందిన నిధిని పొంది చెన్నకేశవుడినే నిలిపావయ్యా కనకదాసుగా మెరిసా వయ్యా కురబల పీఠాధిపతిగా పూజించామయ్యా...
కోనకోన మంత్రం బలికి బండరాయిని మాయం చేసి గంగాదేవికి దారి చూపి
భూలోకాన కనకదాసు మహిమనే చాటావయ్యా...
ఉడిపిలోనా గుడిలోన
హరిదాసుడని బయటికి తరిమి అంటరాని వాడిగా ముద్ర వేస్తే...ఆ కిటికీలోనే తొంగి చూసి హరిదాసుగా కీర్తనలే పాడి ఆ శ్రీహరినే కొలిచావయ్యా
ఆ శ్రీహరిని తిరిగించావయ్యా..
ఆ శ్రీకృష్ణ పరమాత్మనే కొలిచావయ్యా...
శ్రీ కనకదాసు మహిమనేచాటి
కనకద కిండిగా నిలిచావయ్యా...
నాను హోదరే హోగుబేకు
స్వర్గ ఎల్లా నోడుబేకు
అల్లఇల్లందురే యారు హోగల్లా
అదుక్కే అందుకే అదుక్కే
నాను నాను హోగు బేకు
స్వర్గ ఎల్లా నోడు బేకు...




హిందూపురంలో శ్రీ భక్త కనకదాసు జయంతి ఉత్సవ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న హరిప్రసాద్




.శ్రీ భక్త కనకదాసు విగ్రహం ముందు కనకదాసు పాటను విడుదల చేస్తున్న హరిప్రసాద్ మిత్ర బృందం

ఐకమత్యమే మహాబలమని
కలిసి ఉంటే కలదు సుఖమని
ఊరు ఊరు వాడ వాడ
పల్లె పల్లె వల్లే వేసిన
ప్రభంజనమే కురబలన్నా...
కనకదాసు కలలుగన్న సమసమాజమే రావాలన్నా ..
ఈ పాటను స్వయంగా పాడి వినిపించారు.

# హిందూపురంలో బాలకృష్ణ ఓ గెస్ట్ ఆర్టిస్ట్..

## హిందూపురం శివారులో అనంత, పెద్దారెడ్డి, వైసీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు
## నిరసనగా రోడ్డుపైనే బైఠాయించిన నాయకులు
## అరెస్ట్ చేసి అనంతపురం తరలింపు

**అనంతపురం/హిందూపురం, నవంబర్ 16 :**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురంలో ఆ పార్టీని గెలిపిస్తున్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బాలకృష్ణ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని. ఎన్నికలకు ముందు కుటుంబ సభ్యులతో రావడం, ఆ తర్వాత సినిమాలకు పరిమితం కావడం పరిపాటిగా మారిందన్నారు. హిందూపురం నియోజకవర్గానికి బాలకృష్ణ గెస్ట్ ఆర్టిస్ట్ అని వ్యాఖ్యానించారు. శనివారం హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి అనంతపురం నుంచి హిందూపురానికి బయలుదేరిన అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహం వద్దే టూటౌన్ సీఐ శ్రీకాంత్, పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై మండిపడ్డ అనంత హిందూపురం వెళ్లారు. హిందూపురం పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ వద్దకు చేరుకోగానే అనంతతో పాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, వైసీపీ అనంతపురం నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, యువజన విభాగం అనంతపురం నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, ఇతర నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోకి అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. ఆ క్రమంలో పోలీసులకు, అనంతకు మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీ కార్యాలయంపై టీడీపీ మూకలు దాడి చేస్తే పరిశీలించేందుకు రాకూడదంటే ఎలా? అని సూటిగా ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికి వెళ్లడం లేదని, పార్టీ శ్రేణులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తమను అడ్డుకోవడం తగదంటూ రోడ్డుపైనే వైసీపీ నాయకులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు పోలీసులు వారిని వాహనాల్లో అనంతపురం తరలించారు. అనంతపురంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు అనంతతో పాటు ఇతర నాయకులను తీసుకొస్తున్నారన్న సమాచారం అందుకున్న వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున కోర్టు రోడ్డుకు చేరుకున్నారు. పోలీస్ వాహనం రాగానే రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు అనంతను ఆయన స్వగృహానికి చేర్చి మళ్లీ బయటకు వెళ్లకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

**కూటమి పాలనలో రావణకాష్టం**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూపురంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై టీడీపీ గూండాలు, అల్లరి మూకలు దాడి చేసి సిబ్బంది, కార్యకర్తలను గాయపర్చారన్నారు. దాడిలో గాయపడ్డ వారితో పాటు పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ఎక్కడికక్కడ కీలక నాయకులను గృహ నిర్బంధం చేయడం ఏంటని ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికో, రెచ్చగొట్టడానికో వెళ్లలేదని స్పష్టం చేశారు. తమపై పోలీసులు జులుం ప్రదర్శించి అరెస్ట్ చేశారన్నారు. పోలీసులున్నది టీడీపీ నాయకులకు తొత్తుగా ఉండాలని కాదన్నారు.

# హెచ్‌ఎల్‌సి గట్టుకు పొంచిఉన్న ప్రమాదం!

## కాలువను ఆనుకొని అక్రమంగా మట్టి తవ్వకాలు...
## మట్టి లారీల్లో బళ్లారికి తరలింపు..
## ప్రధాన కాలువ ఇరువైపులా 100 మీటర్ల వరకు తవ్వకాలు నిషేధం..
## తవ్విన ప్రాంతం ఆంధ్రనా.. కర్ణాటకనా..
## తేల్చాల్సిన పని అధికారులదే..



బొమ్మన హాల్ గ్రామం సమీపంలోని సరిహద్దు ప్రాంతంలో హెచ్ ఎల్ సి ప్రధాన కాలువ గట్టు ఆనుకొని మట్టిని అక్రమంగా తవ్విన ప్రాంతం

**డి.హిరేహాళ్/ బొమ్మనహల్, నవంబర్ 16:**
రాయదుర్గం నియోజకవర్గం లోని కర్ణాటక సరిహద్దులో ఉన్న బొమ్మనహల్ గ్రామం సమీపంలోని హెచ్‌ఎల్‌సి ప్రధాన కాలువ గట్టు కబ్జాకు గురవుతోంది. హెచ్ ఎల్ సి ప్రధాన కాలువ ఆనుకొని మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. తవ్విన మట్టిని కర్ణాటక ప్రాంతానికి అక్రమంగా లారీల్లో తరలిస్తున్నారు. ప్రధాన కాలువ ఆనుకొని దాదాపు 200 మీటర్లు పొడవునా 20 అడుగుల లోతు వరకు భారీ యంత్రాలతో తవ్వేశారు. ఈ అక్రమ మట్టి తవ్వకాలు గత వారం రోజుల నుండి భారీ యంత్రాలతో మట్టిని తవ్వేస్తున్న హెచ్ ఎల్ సి అధికారులు కానీ ఇటు రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోవడంలేదని చుట్టుపక్కల ఉన్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్.ఎల్.సి ప్రధాన గట్టు ఆనుకొని అక్రమంగా మట్టి తవ్వుతున్న ప్రాంతం కర్ణాటక పరిధిలోకి వస్తుందని ఇది ఆంధ్రా పరిధిలోకి రాదని ఆ పొలం యజమాని పేర్కొంటున్నారు. ఆ ప్రాంతం ఆంధ్ర ప్రాంతమైన కర్ణాటక ప్రాంతమైన హెచ్‌ఎల్సీ ప్రధాన కాలువ ఇరువైపులా వంద నుంచి రెండు మందల మీటర్ల వరకు మట్టి తవ్వకాలు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని భేఖాతర్ చేస్తూ భారీ యంత్రాలతో ప్రధాన కాలువ గట్టు అనుకొని అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారని చుట్టుపక్కల రైతులు మండిపడుతున్నారు.



హెచ్.ఎల్.సి గట్టు వద్ద అక్రమంగా తవ్విన మట్టిని లారీలకు నింపుతున్న దృశ్యం

ప్రధాన కాలువ గట్టు ఆనుకొని 20 మీటర్లు లోతు వరకు మట్టిని తవ్వడంతో కాలువ దెబ్బతిని పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్టు ఆనుకొని మట్టిని తవ్వడంతో దృఢంగా ఉన్న ప్రధాన కాలువ గట్టు బలహీనపడితే పంటలు, కాలువ వంటి వ్యవస్థనే ప్రమాదంలో పడుతుందని తెలిసినా కూడా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏడాది తుంగభద్ర నీళ్ళు విడుదల చేస్తున్న సమయంలో కాలువ గట్టుకు అక్కడక్కడ గండ్లు పడి సాగునీరు వృధా అవుతున్న విషయం తెలిసిందే. కాలువ లీకేజ్ వల్ల పంట పొలాల్లోకి చేరి పంటలు కూడా దెబ్బతిన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఈ విషయమై రెవెన్యూ పోలీస్ శాఖల అధికారులను వివరణ కోరగా హెచ్‌ఎల్సీ కాలువ వద్ద అక్రమంగా మట్టిని అవుతున్న ప్రాంతం సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో రికార్డును పరిశీలించి ఆ ప్రాంతం మా పరిధిలోకి వస్తే అక్రమంగా మట్టిని తవ్విన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# ఘనంగా కార్తీక మాస వనమహోత్సవం

## యాదవ్ సంఘ ఆధ్వర్యంలో వనభోజనం కార్యక్రమం..
## జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంచల బాబు యాదవ్..



టిడిపి నేత చంచల బాబు యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

**ఉదయగిరి, నవంబర్ 16**
ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంచల బాబు యాదవ్ ఆదివారం నాడు కార్తీక మాసం సందర్భంగా మర్రిపాడు మండలం లోని మర్రిపాడు గ్రామంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు నాగ కిషోర్ యాదవ్ అధ్యక్షత జరిగిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఘన స్వాగతం జిల్లా యాదవ సంఘ సభ్యులు పలికారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వేదమంత్రాల నడుమ శివలింగానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ యాదవ జాతి విద్య ఐక్యమత్యంతో ముందుకు సాగాలని గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని రాజకీయంగా ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. కార్తీకమాసం సందర్భంగా శివుని ఆశీస్సులు శ్రీకృష్ణ భగవాన్ ఆశీస్సులు అందరికి ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యాదవ సంఘం పెద్దలు, యాదవ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.




అభిషేకం చేస్తున్న టిడిపి నేత చంచల బాబు యాదవ్

# బొబ్బిలి కోటను సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**ఉదయగిరి, నవంబర్ 16 :**
ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదివారం నాడు విజయనగరంలోని చారిత్రక ప్రాధాన్యం ఉన్న బొబ్బిలి కోటను సందర్శించారు. ఈ సందర్భంగా తన మిత్రుడు, బొబ్బిలి నియోజకవర్గ శాసనసభ్యులు బేబినాయన ఆహ్వానం మేరకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బొబ్బిలి కోటను సందర్శించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ను సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించి, ప్రతిష్టాత్మకమైన బొబ్బిలి వీణను బహుమతిగా అందజేశారు. అనంతరం కోటలోని దర్బార్ మహల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు, అలనాటి బొబ్బిలి యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాల చరిత్ర, వాటి ప్రత్యేకతను అక్కడి ప్రతినిధులు వివరించారు. అలాగే అప్పట్లో ఉపయోగించిన రాజవంశానికి చెందిన కార్లు, రాజుల చిత్రపటాలు, కోటలోని ముఖ్య ప్రదేశాలు అన్నింటినీ వీక్షించారు. ఈ కార్యక్రమంలో మధు రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం



బొబ్బిలి కోటను సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

# చండీ హోమంలో పాల్గొన్న ప్రముఖులు

**కనేకల్ నవంబర్ 16:**
కనేకల్ పట్టణంలో శనివారం, ఆదివారం బజాజ్ షోరూం ప్రొప్రైటర్ తిప్పే స్వామి నిర్వహించిన చండీ హోమం కు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాయదుర్గం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ మెట్టు గోవిందరెడ్డి తనయుడు రాష్ట్ర వైసిపి జాయింట్ సెక్రెటరీ మెట్టు విశ్వనాథరెడ్డి, ఎమ్మెల్సీ ఉరవకొండ శివరామిరెడ్డి, ప్రముఖ గురువులు తదితరులు పాల్గొన్నారు. శనివారం నుండి చండీ హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించగా అమ్మవారికి ప్రత్యేక పూజలు వేద పండితులు మంత్రంలతో అద్భుతంగా యాగం జరిగింది. వక్తలు మాట్లాడుతూ చండీయాగం చాలా అద్భుతమైన యాగమని త్యాగం వల్ల ఊరికి అంతా మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు. యాగానికి మండల ప్రజల సైతం పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



శ్రీ చిక్కనేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర వైయస్సార్సీపీ జాయింట్ సెక్రెటరీ మెట్టు విశ్వనాథ్ రెడ్డి



నూతన దంపతులకు ఆశీర్వాదం అందించిన నాయకులు

మెట్టు విశ్వనాథరెడ్డికి గురువులు శాలువా కప్పి అమ్మవారి ఆశీర్వచనాలు అందించారు. హోమంలో పాల్గొ న్న ప్రతి ఒక్కరికి తీర్థప్రసాద వినియోగం అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అంతకు ముందు మెట్టు విశ్వనాథరెడ్డి పట్టణంలోని ప్రధాన క్షేత్రమైన శ్రీ చిక్కనేశ్వర స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేసీఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో మారేంపల్లి వైఎస్ఆర్సిపి పార్టీకి చెందిన మారెన్న బ్రదర్స్ శ్రీనివాసులు కూతురి వివాహంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గురువులు శాంత లింగ శివాచార్య స్వామి వీరభద్ర శివాచార్య స్వామి చెన్న వీర శివాచార్య స్వామి వీర శైవ లింగాయత్ భక్తాదులు వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చండీయాగంలో పాల్గొన్న రాజకీయ ప్రముఖులు, గురువులు

# సతీశ్ కుమార్ కేసులో విచారణ వేగవంతం

## రెండవ రోజు కదిలే రైలు నుంచి బొమ్మలు కిందకు తోసి పరిశీలన..
## డ్రోన్ కెమెరాల సహాయంతో ఘటన చిత్రీకరణ..
## రైల్వే టీసీ, ఇతర సిబ్బందిని విచారిస్తున్న పోలీసులు..
## రైల్వే ఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో ఘటనా స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్..

**తాడిపత్రి, నవంబర్16:**
తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతి కేసు విచారణలో కీలక పరిమాణాలు చోటుచేసుకున్నాయి. సంఘటనా స్థలంలో పోలీసులు రెండవ రోజున ఆదివారం మళ్ళీ సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. తాడిపత్రి సమీపంలోని కోమలి వద్ద సతీష్‌కుమార్ మృతదేహం లభ్యమైన ప్రాంతంలో రైల్వే ఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో రెండవ రోజున సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేపట్టారు. గుత్తి నుంచి తిరుపతి వెళ్తున్న రన్నింగ్ రైలు నుంచి రెండు బొమ్మలను కిందకు తోసివేశారు. ఒకటి కూర్చున్న స్థితిలో, మరొకటి నిలబడిన స్థితిలో తోసి, డ్రోన్ కెమెరాల సహాయంతో మొత్తం ఘటనను చిత్రీకరించారు. దాదాపు 5 గంటల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. శనివారం చేపట్టిన సీన్ రీకన్‌స్ట్రక్షన్ లో రాయలసీమ ఎక్స్ ప్రెస్ ట్రైన్ వేగంతో ట్రయిల్ ట్రైన్ వేగం సరిపోక పోవడంతో బొమ్మలు తక్కువ దూరంలో పడటంతో ఫలితం లేకపోవడంతో మరల సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేపట్టారు. ఈ రెండు పరిణామాలతో కేసు దర్యాప్తు మరింత వేగవంతమైంది. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో విధులు నిర్వర్తించిన టీసీ, ఇతర సిబ్బందితో పాటు బెడ్‌రోల్ అటెండర్లు రాజీవ్ రతన్, కృష్ణయ్యలను రైల్వే పోలీసులు శనివారం విచారించారు. సతీష్‌కుమార్‌కు కేటాయించిన సీటు నెంబర్ 29 కాగా, ఆయన లగేజీ బ్యాగ్ 11వ నెంబర్ సీటు వద్ద ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. రాయలసీమ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో లభించిన సతీశ్ కుమార్ లగేజీ బ్యాగ్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తిరుపతి ఆర్పీఎఫ్ కార్యాలయంలో ఈ బ్యాగ్‌ను అప్పగించారు. దీంతో అసలు ఆయన బ్యాగ్ అక్కడికి ఎలా చేరిందనే కోణంలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



కదిలే రైలు నుంచి బొమ్మలు తోసివేసి పరిశీలిస్తున్న దృశ్యం



# రవితేజకు విజయాలతో పనిలేదు



మాస్ మహారాజా రవితేజకు విజయాపజయాలతో పని లేదు. సాధారణంగా హీరోలు ఎవరైనా ఒక సినిమా ఫ్లాప్ అయ్యింది అంటే నెలలు నెలలు బయట కనిపించరు. కానీ, రవితేజ అలా కాదు. ఒక సినిమా పోయింది.. మరో సినిమా తీయకుండా ఉంటామా అని నేనింతే సినిమాలో డైలాగ్ చెప్పేస్తాడు. సినిమా ఫ్లాప్ అయ్యిందని తెలిసిన మొదటి రోజే.. ఓకే నాకు వేరే సినిమా ఉంది.. దాని షూటింగ్ వెళ్లిపోతున్నా అని చెప్తాడట. అంత ప్రాక్టికల్ గా ఉంటాడు రవితేజ.ఈ మధ్యనే మాస్ జాతర సినిమా భారీ పరాజయాన్ని అందుకుంది. అయినా కూడా వెంటనే భర్తమహాశయులకు విజ్ఞప్తి సినిమాను ప్రకటించి షాక్ ఇచ్చాడు. మన పని మనం చేసుకుంటూ పోవాలి.. అనేది రవితేజ నమ్ముతాడు. ప్రస్తుతం ఈ సినిమాతో బిజీగా ఉన్న రవితేజ.. ఈ మధ్యనే మరో సినిమాను పట్టాలెక్కించాడని తెలుస్తోంది. నిన్ను కోరి, మజిలీ, ఖుషి లాంటి క్లాసిక్ లవ్ స్టోరీస్ తో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ తో ఒక సినిమా చేయబోతున్నట్లు సమాచారం.

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన ఖుషి ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఆ తరువాత శివ తన ఫంథాను మార్చుకొని ఒక క్రైమ్ థ్రిల్లర్ స్టోరిని రాసుకున్నది. ఆ కథనే రవితేజకు వినిపించడం.. ఆయనకు నచ్చడం జరిగిందని.. ఈ సినిమాను నవంబర్ చివరి వారంలో అనౌన్స్ చేయనున్నారని టాక్ నడుస్తోంది. శివ నిర్వాణ.. లవ్ స్టోరీస్ నుంచి బయటకు వచ్చి టక్ జగదీష్ లాంటి మాస్ యాక్షన్ సినిమాతో వచ్చాడు.. కానీ ప్రేక్షకులు ఆదరించలేదు. ఇప్పుడు క్రైమ్ థ్రిల్లర్ అంటూ కొత్త ప్రయోగంతో వస్తున్నాడు. ఇది వర్క్ అవుట్ అవుతుందా అనే అనుమానాలు లేకపోలేదు. మరి ఈ కాంబో ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.


# సిద్దార్థ్‌కు జంటగా రాశీఖన్నా



కోలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన కాంబినేషన్ తెరమీదకు వచ్చింది. లవర్ బాయ్ సిద్ధార్థ్ రాశీ ఖన్నా జంటగా ఫస్ట్ టైం ఓ సినిమా రూపొందుతుంది. అంతేకాదు తొలిసారి నటించే చిత్రానికి 'రౌడీ అండ్ కో' అనే టైటిల్ ఖరారు చేశారు. సునీల్, యోగిబాబు , రెడిన్ కింగ్స్, ఫ్రాంక్ స్టార్ రాహుల్, వెట్రిమణి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.గతంలో సిద్దుతో టక్కర్ అనే డిఫరెంట్ చిత్రం తెరకెక్కించిన కార్తిక్ జి క్రిష్ దర్శకత్వం వహిస్తుండగా ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సిద్దు, రాశీ ఖన్నా మొదటి సారి కలిసి నదుస్తుండడంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి.ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'ఇది రౌడీల కార్పొ రేట్ సామ్రాజ్యానికి సంబంధించిన స్టోరీ. అందుకే 'రౌడీ అండ్ కో' అనే టైటిల్ ఖరారు చేశాం. ఫుల్ లెంగ్త్ హాస్యభరితంగా తెరకెక్కిస్తున్నాం. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా మూవీగా రూపుదిద్దుకుంటుంది.

ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేశాం. మరో 15-20 రోజుల్లో పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేస్తాం. చెన్నైలో షూటింగ్ జరుపు కున్న ఈ చిత్రం అనేక సంక్లిష్ట సంఘటనలు, తద్వారా ఏర్పడే సమస్యలను ఎంతో ఫన్నీగా చిత్రీకరించాం' అని వివరించారు.

# మోహన్‌బాబు ఇవ్వనున్న భారీ పార్టీ



మంచు భక్తవత్సలం నాయుడు.. మోహన్ బాబు గా మారి 50 ఏళ్ళు పూర్తయ్యాయి. సినీ పరిశ్రమలో ఎన్నో ఒడిదుడుకులకు దాటుకొని మోహన్ బాబు 50 వసంతాలు పూర్తిచేసుకున్నాడు. ఇక తండ్రి 50 ఏళ్ల ఉత్సవాన్ని కొడుకు మంచు విష్ణు ఎంతో ఘనంగా నిర్వహించాలని ప్లాన్ చేశాడు. నవంబర్ 22 న ఎంబీ50- ఎ పెర్ల్ వైట్ ట్రిబ్యూట్ పేరుతో ఓకే ఈవెంట్ ను నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ఇండస్ట్రీ మొత్తం కదిలిరానుంది.ఇక దీనికన్నా ముందే మోహన్ బాబు మరో పార్టీని ఎరేంజ్ చేసినట్లు తెలుస్తోంది. నేడు దస్పల్లా లో మోహన్ బాబు ఒక ల్యావిష్ పార్టీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ పార్టీకి ఇండస్ట్రీ నుంచి పెద్ద పెద్ద వాళ్ళు, కుటుంబ సభ్యులు, మోహన్ బాబు క్లోజ్ ఫ్రెండ్స్ మాత్రమే అటెండ్ అవ్వనున్నారట. దీని కోసం మోహన్ బాబు చాలానే ఖర్చు పెట్టినట్లు సమాచారం. ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తనతో పనిచేసినవారు.. తనను ఆదరించినవారు.. తనకు సపోర్ట్ గా నిలిచినవారిని పిలిచి వారికి థాంక్స్ చెప్పనున్నాడట మోహన్ బాబు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.